

# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV

STRUGGLE FOR JUSTICE

సామాన్యుడి ఆయుధంగా




సంపుటి - 07 | సంచిక 225 | ఎడిటర్ : బరిగెల శివ | బుధవారం, 15, జులై 2026 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పంజాబ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్




# సామాజిక వర్గాలు.. శాసిస్తున్నాయి !



● రాష్ట్ర పాలనలు రాటు తేలుతున్నాయి ● కుల రాజకీయాలకు పెద్దపీట వేస్తున్నారు. ● రెడ్డి సంఘం రాజ్యమేలుతుంది. ● మొన్న వెలమ నేడు రెడ్డి పాలకులంతా ఒక్కటే. ● ప్రజల బతుకుల్లో మార్పు ఎక్కడ ● నామినేటెడ్ పదవులన్నీ రెడ్డి రెడ్డిలవే. ● రాష్ట్రంలో సామాన్య ప్రజలు నలిగిపోతున్నారు. ● రాష్ట్ర డిజిపి మహిళా పోలీస్ ఉన్నతాధికారులు మాత్రమే ప్రజలకు మేలు చేస్తున్నారు. ● కక్ష సాధింపు చర్యల్లో రాజకీయ రెడ్డిలదే ఆధిపత్యం. ● విపరీతమైన ఆస్తులు కూడబెట్టుకుంటున్నారు. ● రాష్ట్ర రాజకీయాలను శాసిస్తున్నారు. ● భూ భారతి పేరు మీద లక్షల కోట్ల విలువచేసే భూములు కబ్జాల పాలవుతున్నాయి. ● డాక్టర్ బరిగెల శివ.

డాక్టర్ బరిగెల శివ

జై భీమ్ సంస్థల ఫౌండర్, చైర్మన్



తెలంగాణ రాష్ట్రంలో కుల ఆధారిత రాజకీయాలు ప్రజాస్వామ్య విలువలను దెబ్బతీస్తున్నాయని డాక్టర్ బరిగెల శివ ఆరోపించారు. అధికార, నామినేటెడ్, పరిపాలనా పదవుల్లో ఒకే సామాజిక వర్గం ఆధిపత్యం కొనసాగడం వల్ల సామాజిక న్యాయం బలహీనపడుతోందని అన్నారు. అన్ని వర్గాలకు సముచిత ప్రాతినిధ్యం కల్పించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్రంలో భూ కబ్జాలు, అవినీతి, అధికార దుర్వినియోగం, కక్షసాధింపు చర్యలపై ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతోందని పేర్కొన్నారు. నిరుద్యోగుల సమస్యలు, ఖాళీ ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ, విద్యా వ్యవస్థలో సంస్కరణలపై ప్రభుత్వం దృష్టి సారించాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో ఏ ఒక్క సామాజిక వర్గానికీ అధిక ప్రాధాన్యం ఉండకూడదని అన్నారు. పరిపాలనలో సమాన అవకాశాలు, పారదర్శకత, రాజ్యాంగ స్ఫూర్తి ప్రతిబింబించాలని అభిప్రాయపడ్డారు. అన్ని కులాలు, వర్గాలు, మతాలకు సమన్యాయం జరిగేలా ప్రభుత్వ వ్యవస్థలు పనిచేయాలని కోరారు. సామాజిక న్యాయం, ప్రజాస్వామ్య పరిరక్షణే తెలంగాణ అభివృద్ధికి బలమైన పునాదిగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం సమతుల్య పాలనకు కట్టుబడి ఉండాలని డాక్టర్ బరిగెల శివ పిలుపునిచ్చారు.

- హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)

2

## ముద్రగడ పద్మనాభ రెడ్డి కన్నుమూత

మాజీ మంత్రి, కాపు ఉద్యమ నేతకు ముగిసిన రాజకీయ ప్రస్థానం


అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస

ఎమ్మెల్యే, ఎంపీ, మంత్రిగా ప్రజాసేవలో ప్రత్యేక గుర్తింపు

కాపు రిజర్వేషన్ల ఉద్యమానికి చిరస్మరణీయ నాయకత్వం

2024లో పేరు మార్పుతో మరోసారి వార్తల్లో నిలిచిన ముద్రగడ

5



## సమాజ నిర్మాణంలో మ్యారేజ్ బ్యూరోలది కీలక పాత్ర

మాజీ ఉప ముఖ్యమంత్రి డాక్టర్ తాటికొండ రాజయ్య




7

## రక్తం చిందిస్తే వానలు పడతాయన్న వ్యాఖ్యలు బాధాకరం

సిఎం రేవంత్ రెడ్డిపై వెంటనే కేసు పెట్టాలి

డిజిపిని కోరిన బిఆర్ఎస్ నేత ప్రవీణ్ కుమార్

5



## అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో విమానాశ్రయాల నిర్మాణం

ఎంఆర్‌వో, ఎయిర్ కార్గో, హ్యాంగర్ వసతులు కల్పించాలి..

కాకతీయ సంస్కృతికి అద్దం పట్టేలా వరంగల్ విమానాశ్రయం

ఆదిలాబాద్‌కు అవసరమైన భూ సేకరణచేపడతాం : కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

7




## కాకతీయ యూనివర్సిటీలో ప్రొఫెసర్ పి. శ్రీనివాసరావుకు కీలక బాధ్యతలు

18 ఏళ్ల సేవలకు గుర్తింపుగా హెచ్‌వోడీ బాధ్యతలు

2



# కాకతీయ యూనివర్సిటీలో ప్రొఫెసర్ పి. శ్రీనివాసరావుకు కీలక బాధ్యతలు

**18 ఏళ్ల సేవలకు గుర్తింపుగా హెచ్‌వోడీ బాధ్యతలు**



**హన్మకొండ, జూలై 14, 2026 (జై భీమ్ న్యూస్)**

కాకతీయ యూనివర్సిటీలో ప్రజా పాలనా శాస్త్రం (పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్), మానవ వనరుల నిర్వహణ శాస్త్రం (హెచ్‌ఆర్‌ఎం) విభాగాలకు విభాగాధిపతి (హెచ్‌వోడీ)గా ప్రొఫెసర్ పి. శ్రీనివాసరావును నియమిస్తూ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి. రామచంద్రం ఉత్తర్వులు జారీ చేశారు. గత 18 ఏళ్లుగా విశ్వవిద్యాలయంలో వివిధ కీలక బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించిన ఆయనకు మరోసారి ఈ బాధ్యతలు అప్పగించారు. ప్రొఫెసర్ పి. శ్రీనివాసరావు కాకతీయ యూనివర్సిటీలో నిబద్ధతతో సేవలందిస్తూ యూనివర్సిటీ డిసేబుల్డ్ సెల్ డైరెక్టర్, డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ జాయింట్ డైరెక్టర్, యూనివర్సిటీ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్, యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి, యూనివర్సిటీ హాస్టల్స్ డైరెక్టర్, ప్రజా పాలనా శాస్త్రం, హెచ్‌ఆర్‌ఎం విభాగాల విభాగాధిపతి, బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్ వంటి పలు కీలక హోదాల్లో విశిష్ట సేవలు అందించారు. ప్రస్తుతం కూడా పలు కళాశాలలకు బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా కొనసాగుతూ విద్యా ప్రమాణాల పెంపునకు కృషి చేస్తున్నారు. అలాగే 2008 నుంచి 2018 వరకు నిర్వహించిన వివిధ సెట్‌ల ఆఫ్‌లైన్ అడ్మిషన్స్ కౌన్సెలింగ్‌లో వెరిఫికేషన్ ఆఫీసర్, చీఫ్ వెరిఫికేషన్ ఆఫీసర్‌గా పనిచేసి అడ్మిషన్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించడంలో కీలక పాత్ర పోషించారు. ప్రొఫెసర్ పి. శ్రీనివాసరావుకు మరోసారి హెచ్‌వోడీ బాధ్యతలు అప్పగించడంపై విశ్వవిద్యాలయ అధ్యాపకులు, అధికారులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు అభినందనలు తెలిపారు.

# చిన్ననాటి పోలియోను జయించి..

**దివ్యాంగుల హక్కుల కోసం జీవితాన్ని అంకితం చేసిన ప్రొఫెసర్ శ్రీనివాసరావు**

**వంద శాతం దివ్యాంగుడి నుంచి ప్రొఫెసర్‌గా ఎదుగుదల..**

**126 పరిశోధన వ్యాసాలు, దివ్యాంగుల సంక్షేమం కోసం మూడు దశాబ్దాల ఉద్యమం**

**వరంగల్, 14 జూలై 2026 (జై భీమ్ న్యూస్)**



రెండేళ్ల వయస్సులో పోలియో బారినపడి వంద శాతం దివ్యాంగుడిగా జీవితాన్ని ప్రారంభించిన ప్రొఫెసర్ శ్రీనివాసరావు, తన ఆత్మవిశ్వాసం, పట్టుదల, కృషితో విద్యా, పరిశోధన, సామాజిక సేవా రంగాల్లో విశిష్ట స్థానాన్ని సంపాదించారు. శారీరక వైకల్యాన్ని అధిగమించి ఉన్నత విద్యను అభ్యసించడమే కాకుండా, దివ్యాంగుల హక్కులు, సంక్షేమం, సాధికారత కోసం తన జీవితాన్ని అంకితం చేస్తూ మూడు దశాబ్దాలుగా ఉద్యమాలు నిర్వహిస్తున్నారు. ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం బనిగండ్లపాడు గ్రామానికి చెందిన శ్రీనివాసరావు రెండేళ్ల వయస్సులో పోలియో బారినపడ్డారు. అయినప్పటికీ నిరాశ చెందకుండా క్యాంపస్‌లోనే ఎం.ఏ., ఎల్.ఎల్.బి. పూర్తి చేసి, అనంతరం ప్రొఫెసర్ వి. శోభ పర్యవేక్షణలో ఆంధ్రప్రదేశ్‌లో దివ్యాంగుల సంక్షేమ పథకాల పనితీరు అనే అంశంపై పరిశోధన చేసి 2006లో పీహెచ్.డి. పట్టా పొందారు. అనంతరం భారత సామాజిక శాస్త్ర పరిశోధన మండలి (ఐసీఎస్ఎస్ఆర్), న్యూఢిల్లీ ఆర్థిక సహకారంతో "తెలంగాణ రాష్ట్రంలో దివ్యాంగుల విద్య, ఉపాధి" అంశంపై మేజర్ రీసెర్చ్ ప్రాజెక్టును చేపట్టి 2018లో విజయవంతంగా పూర్తి చేశారు. దివ్యాంగుల విద్య, ఉపాధి అవకాశాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, సామాజిక పరిస్థితులపై ఆయన చేసిన పరిశోధనలకు విశేష గుర్తింపు లభించింది. ప్రొఫెసర్ శ్రీనివాసరావు ఇప్పటివరకు 126 పరిశోధన వ్యాసాలు ప్రచురించగా, వాటిలో 60 వ్యాసాలు దివ్యాంగుల సమస్యలు, హక్కులు, సంక్షేమం, సాధికారత వంటి అంశాలపైనే ఉన్నాయి. ఆయన పర్యవేక్షణలో తొమ్మిది మంది పరిశోధకులు డాక్టరేట్‌లు సాధించగా, ప్రస్తుతం మరో పది మంది పరిశోధనలు కొనసాగిస్తున్నారు. పరిశోధనలతో పాటు దివ్యాంగుల హక్కులు మరియు సాధికారత కోసం ప్రత్యేక సంస్థను ఏర్పాటు చేసి, గత 30 సంవత్సరాలుగా వారి విద్య, ఉపాధి, రిజర్వేషన్లు, సంక్షేమ పథకాల అమలు, సమాన అవకాశాల కోసం అనేక ఉద్యమాలకు నాయకత్వం వహిస్తున్నారు. వ్యక్తిగత జీవితాన్ని సైతం పక్కనపెట్టి దివ్యాంగుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్నారు. 1996 నుంచే తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో చురుకుగా పాల్గొని సామాజిక న్యాయం, సమానత్వం కోసం తన వంతు పాత్ర పోషించారు. విద్యా రంగంలో పరిశోధకుడిగా, సామాజిక ఉద్యమకారుడిగా, దివ్యాంగుల హక్కుల పరిరక్షకుడిగా ఆయన ప్రత్యేక గుర్తింపును సంపాదించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ శ్రీనివాసరావు సేవలను కొనియాడుతూ పలువురు విద్యార్థులు, పరిశోధకులు, ఆయన వద్ద డాక్టరేట్‌లు పొందిన శిష్యులు, ఉద్యోగులు ప్రత్యేక అభినందనలు తెలిపారు. చిన్ననాటి శారీరక వైకల్యాన్ని జయించి వేలాది మంది దివ్యాంగులకు స్ఫూర్తిగా నిలుస్తూ, వారి హక్కుల సాధన కోసం జీవితాన్ని అంకితం చేసిన ఆయన సేవలు సమాజానికి ఆదర్శప్రాయమని పేర్కొన్నారు.

# పంటలకు నీరివ్వాలని రైతుల డిమాండ్

**అమలాపురం నీటిపారుదల శాఖ కార్యాలయం ముట్టడి**

**అమలాపురం,జూలై14(జై భీమ్ న్యూస్):**

పంటలకు తక్షణమే నీరు అందివ్వాలని డిమాండ్ చేస్తూ అమలాపురం నీటిపారుదల శాఖ కార్యాలయాన్ని రైతులు మంగళవారం ముట్టడించారు. అక్కడే విధుల్లో ఉన్న పోలీసులను నెట్టుకుంటూ వారంతా కార్యాలయంలోకి చొచ్చుకెళ్లారు. ఇరిగేషన్ డీఈ కార్యాలయం వద్ద రైతులంతా బైఠాయించారు. దీంతో స్థానికంగా ఉద్రిక్తత నెలకొంది. కాలువల ఆధునీకరణ పనుల పేరుతో నీటిని ఆపేసి పనులు చేయిస్తున్న అధికారుల వైఖరిని ఈ సందర్భంగా వారు నిలదీశారు. కాంట్రాక్టర్‌కు సహకరించి రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్న అధికారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. అలాగే ఇరిగేషన్ డీఈ తక్షణమే తమ వద్దకు వచ్చి సమాధానం చెప్పాలంటూ నిరసన వ్యక్తం చేశారు. దాంతో డీఈ కార్యాలయానికి తాళం వేసేందుకు వారంతా సిద్ధమయ్యారు. వారి ప్రయత్నాన్ని పోలీసులు అడ్డుకున్నారు. అదే సమయంలో అక్కడికి వచ్చిన ఇరిగేషన్ డీఈ శ్రీరామ జనార్దన్.. రైతులతో మాట్లాడారు. గురువారం సాయంత్రం కల్లా పూర్తిగా నీటిని అందిస్తామని రైతులకు హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో రైతులు ఆందోళన విరమించారు.

# సామాజిక "వర్గాలు" శాసిస్తున్నాయి

**రాష్ట్ర పాలనలు రాటు తేలుతున్నాయి**
**కుల రాజకీయాలకు పెద్దపీట వేస్తున్నారు.**
**రెడ్డి సంఘం రాజ్యమేలుతుంది.**
**మొన్న వెలమ నేడు రెడ్డి పాలకులంతా ఒక్కటే.**
**ప్రజల బతుకుల్లో మార్పు ఎక్కడ**
**నామినేటెడ్ పదవులన్నీ రెడ్డిలవే.**
**రాష్ట్రంలో సామాన్య ప్రజలు నలిగిపోతున్నారు.**
**రాష్ట్ర డిజిపి మహిళా పోలీస్ ఉన్నతాధికారులు**
**మాత్రమే ప్రజలకు మేలు చేస్తున్నారు.**
**కక్ష సాధింపు చర్యల్లో రాజకీయ రెడ్డిలదే ఆధిపత్యం.**
**విపరీతమైన ఆస్తులు కూడబెట్టుకుంటున్నారు.**
**రాష్ట్ర రాజకీయాలను శాసిస్తున్నారు.**
**భూ భారతి పేరు మీద లక్షల కోట్ల విలువచేసే**
**భూములు కబ్జాల పాలవుతున్నాయి.**
**డాక్టర్ బరిగెల శివ.**

**హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)**

తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో రాటు తేలిపోతున్న కుల రాజకీయాల ఆధిపత్యం తగ్గించబడాలని డాక్టర్ బరిగెల శివ అభిప్రాయపడ్డారు.రాజకీయ పదవులు మొదలుకొని కామినేటెడ్ పదవులు మొదలుకొని అధికార పదవులు మొదలుకొని ఎక్కడ గమనించిన ఒకే సామాజిక వర్గానికి చెందిన రాజకీయ,మంత్రిత్వ, అధికారిక, శాఖలలో ఒకే సామాజిక వర్గమైన రెడ్డిలు ఆధిపత్యం చెలాయిస్తున్నారని ప్రతిపక్షాలతో పాటు రాష్ట్ర ప్రజలు తీవ్రంగా విమర్శలు గుప్పిస్తున్నారని అన్నారు. బీఆర్ఎస్ హయాంలో వెలమలకు పెద్దపీట వేసుకున్నారని 10 సంవత్సరాల కాలం పాటు కొంతమంది వెలమలు రాష్ట్రాన్ని ఏకపక్షంగా షాశించారని ప్రజా విమర్శలను పాలకుల ముందు ఉంచారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కెసిఆర్ ప్రజలకు మేలు చేశారని రాష్ట్ర ప్రజలు రెండవసారి అవకాశం ఇవ్వడంతో పాటు మూడవ దశ ఎన్నికల్లో 40 సీట్లను ఇచ్చి కెసిఆర్ పై ప్రజా విశ్వాసాన్ని చాటుకున్నారని తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నామినేటెడ్ పదవులు మొదలుకొని మంత్రి పదవులు అధికార పదవులు ఎక్కడ చూసినా రెడ్డి సామాజిక వర్గానిదే ఆధిపత్యం నడుస్తుందని కొన్ని చోట్ల ప్రజలకు అత్యద్భుతంగా మేలు చేస్తున్నామని ప్రకటించుకుంటున్న రెడ్డి సామాజిక వర్గం అదే సామాజిక వర్గానికి చెందిన నాయకులు మిగతా చాలా చోట్ల ప్రజా విశ్వాసాన్ని కోల్పోతున్నారని రాష్ట్ర ప్రజలు బహిరంగంగా విమర్శలు కురిపిస్తున్నారని తెలిపారు.రెడ్డి సామాజిక వర్గమైన వెలమ సామాజిక వర్గమైన సామాన్య ప్రజలను అణిచివేయడం సరైనది కాదని రాష్ట్ర ప్రజల తరఫున సూటిగా నిలదీశారు.12 సంవత్సరాల తెలంగాణ రాష్ట్ర స్వతంత్ర పరిపాలనలో ప్రజల బతుకులు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అనే విధంగా ఉందని గుర్తు చేస్తూ ప్రాంతాలవారీగా అభివృద్ధి చెందాల్సిన తెలంగాణ అభివృద్ధికి నోచుకోక మరుగున పడుతుండడంతో కుల రాజకీయాలతో తెలంగాణ రాష్ట్రం బందీ చేయబడిందని గుర్తు చేశారు.

**దొరల పాలనలో దాడుల హవా**

తెలంగాణ రాష్ట్రం ఏర్పడడం నాలుగున్నర కోట్ల ప్రజల ఆకాంక్ష కాగా ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తెలంగాణలో దొరల పాలన అధిపత్యంలో ప్రజలపై ప్రజాస్వామ్య వాదులపై సామాజికవేత్తలపై నిరుద్యోగులపై ఉద్యమకారులపై ప్రజాసంఘాలపై ప్రతిపక్షాలపై రైతులపై కార్మికులపై కూలీలపై విపరీతమైన దాడులు పెరిగిపోతున్నాయని తీవ్రంగా విమర్శించారు.ప్రభుత్వ కార్యాలయాల్లో సామాజిక న్యాయం పాటించకుండా ఒకే సామాజిక వర్గం అత్యధిక పదవుల్లో కొనసాగుతూ వ్యవస్థలను చెలాయిస్తున్నారని సూటిగా నిలదీశారు.న్యాయస్థానాల్లో దళితులకు సంబంధించిన కోర్టులలో కూడా రెడ్డి వెలమ బ్రాహ్మణ సామాజిక వర్గాలకు చెందిన న్యాయమూర్తులను కేటాయించుకొని షెడ్యూల్ కులాలకు తీవ్రమైన అన్యాయం చేస్తున్నారని దానితోపాటు న్యాయస్థానాల్లో సాధారణ ప్రజలు న్యాయం కొరకు ఆశించే పరిస్థితులు లేకుండా పోతున్నాయని న్యాయం జరగాల్సిన చోట పూర్తిగా అన్యాయం రాజ్యమేలుతూ పలుకువడుగలిగిన వ్యాపారులు పైస సంపాదకులు అధికారులు భూ కబ్జాదారులు సామాన్యుల పాలిట శాపంగా మారిపోయి క్రిమినల్ న్యాయవాదులతో కేసులు నడిపించుకుంటూ న్యాయస్థానాలను భ్రష్టు పట్టిస్తున్నారని ఈ సందర్భంగా గుర్తు చేశారు.సీనియర్ క్రిమినల్ న్యాయవాదులమని చెప్పుకునే పెద్ద మనుషులు కోర్టులలో వాదిస్తున్న కేసులు సరియైనవ తప్పుడివా అనే బేధాన్ని చూడకుండా నల్లకోటు ముసుగులో మనీ సంపాదనకు ఉరకలేస్తున్నారని తీవ్రంగా విమర్శించారు.న్యాయాన్ని నమ్ముకొని బ్రతుకుతున్న సామాన్యులపై కరుడుగట్టిన భూ కబ్జాదారులందరూ ఇలాంటి క్రిమినల్ న్యాయవాదుల పేర్లు చెప్పుకొని సమాజంలో చలామణి అవుతుండడమే కాకుండా సాధారణ ప్రజల ఉసురు పోసుకుంటున్నారని హెచ్చరించారు.పోలీసు వ్యవస్థ నైతే చెప్పాల్సిన పనిలేదని ఎక్కడ చూసినా కిందిస్థాయి అధికారులు ఉన్నతాధికారులను తప్పుతో పట్టిస్తూ కిందిస్థాయి సామాజిక వర్గం ప్రజలను చిత్రవధకు గురి చేస్తున్నారని రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడ చూసినా అక్రమ కేసుల పరంపర విపరీతంగా పెరిగిపోతుందని ప్రతి పోలీస్ స్టేషన్లో కొంతమంది అధికారులు పోలీస్ గిరి అడ్డం పెట్టుకొని సామాన్య ప్రజలను చిత్రహింసలు పెడుతూ కొడుతున్నారని అలాంటి సందర్భంలోనే రాజకీయ అధికార పార్టీలకు అనుకూలంగా ఉంటున్న భూకబ్జాదారుల వైపు అక్రమ వ్యాపారస్తుల వైపు అవినీతి అధికారుల వైపు మాత్రం కనీసానికి కూడా కన్నెత్తి చూడడం లేదని హెచ్చరించారు.అదే సందర్భంలో రాష్ట్రంలో ఎక్కడ చూసినా కాంట్రాక్టు టెండర్ల రూపంలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో 80 శాతం పైన రెడ్డి వెలమ బ్రాహ్మణ కులాల ఆధిపత్యం మాత్రమే కొనసాగుతుందని పేద ప్రజల సొమ్మంతా కాంట్రాక్టర్ల రూపంలో పేరు మోసిన ధనికులంతా దోసుకుంటున్నారని వాటి వివరాల కోసం ప్రయత్నిస్తున్న ప్రజలందరికీ మొండి చేయి లభిస్తుందన్నారు.దీన్ని బట్టి చూస్తే ఇతర సామాజిక వర్గాలను ఎదుగనివ్వకుండా,చదువులకు దూరం చేస్తూ, చదువుకొనివ్వకుండా అభివృద్ధి చెందనివ్వకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటున్న అగ్రవర్ణాల ఆధిపత్యం సామాజిక ధర్మం వైపు అడుగులు వేయబడే విధంగా ప్రతి ఒక్కరు సామాజిక న్యాయ పోరాటంలో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.ఉద్యమాలలో ముందస్తు అరెస్టులతో పాటు అక్రమ కేసులతో తెలుగు రాష్ట్రాలలో ఒక రాష్ట్రానికి మించి మరొక రాష్ట్రం తీవ్రమైన పోటీపడుతున్నాయని గుర్తు చేశారు.ఉద్యమ విలువలు తెలిసిన హోం శాఖ మంత్రి ఉద్యమస్ఫూర్తితో ముఖ్యమంత్రి పదవిని అధిరోహించిన సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణ రాష్ట్రంలో పక్క రాష్ట్ర పాలకులు విచ్చలవిడిగా దాడులు చేస్తుంటే వాటిని ఎందుకు పట్టించుకోవడం లేదంటూ వాటిపై స్పందించకుండా ఎందుకు తిప్పి కొట్టడం లేదంటూ సూటిగా అడిగారు.సీఎం రేవంత్ రెడ్డిపై ప్రజలకు ఉన్న గౌరవాన్ని చుట్టుపక్కల ఉన్న నాయకులంతా అధికారులంతా పూర్తిస్థాయిలో విస్మరించబడే విధంగా పావులు కదుపుతున్నారని అందులో భాగంగానే కక్ష సాధింపు చర్యలను పెంచి పోషిస్తూ అవినీతిని అక్రమాలను పెంచి పోషిస్తూ సీఎం రేవంత్ రెడ్డిని తప్పుతో పట్టిస్తున్నారని రాష్ట్ర ప్రజలందరూ గుర్తు చేస్తున్నారు.ఇలాంటి పరిస్థితుల్లో సీఎం రేవంత్ రెడ్డి సందర్భానుసారంగా స్పందించాల్సిన సమయాల్లో కూడా తీవ్రస్థాయిలో విరుచుకుపడుతూ ప్రతిపక్షాల నాయకులును జర్నలిస్టులను రైతులను ఉద్యమకారులను తీవ్రంగా అవమానపరిచే మాటలు మాట్లాడుతున్నాడని ఉద్యోగులు హెచ్చరిస్తున్నట్లు తెలిపారు.

**పదవుల కన్నా ప్రజాస్వామ్యమే శాశ్వతం..**

ప్రభుత్వ ఏర్పాటులో కీలక పాత్ర పోషించిన సాధారణ ప్రజలు మాత్రం అట్టడుగు స్థాయి అభివృద్ధిలోటుకు లోనవుతూ ప్రభుత్వాలు పట్టించుకున్నది లేకుండా, అధికారులు పట్టించుకున్నది లేకుండా, ప్రభుత్వ వ్యవస్థలు పట్టించుకున్నది లేకుండా, వాళ్లకు న్యాయం జరిగేది ఎలా అంటూ సామాజిక న్యాయం కోసం ఎదురుచూస్తున్నారని గుర్తు చేశారు.10 సంవత్సరాల బీఆర్ఎస్ పార్టీ హయాంలో సామాజిక వర్గం పూర్తిగా లోపించిందని భావించిన ప్రజలు కుల సంఘాల అభివృద్ధితో రైతు సంక్షేమ అభివృద్ధితో ప్రజాసంఘాల అభివృద్ధితో కాస్తంత తృప్తి చెందగా నిరుద్యోగ యువత పూర్తిస్థాయిలో 10 సంవత్సరాలు తీవ్రమైన నష్టాన్ని అనుభవించారన్నది 30 లక్షల మంది నిరుద్యోగులు ఏకతాటి మీదికి వచ్చిన సంగతిని ఈ సందర్భంగా గుర్తు చేశారు.రాజకీయాల్లో ఒకే సామాజిక వర్గానికి ప్రాధాన్యతను ఇవ్వడం వల్ల ప్రజాస్వామ్య ఉనికి పూర్తిగా దెబ్బతింటుందని గుర్తు చేశారు.ప్రతి ప్రభుత్వ శాఖలో ఒకే రకమైన సామాజిక వర్గం పూర్తిస్థాయిలో చలామణి అవుతుందని ప్రభుత్వ అధికార పదవుల్లో నైతే బలవంతపు దౌర్జన్యాలు సాగుతున్నాయని హెచ్చరించారు.స్వార్థపూరిత ప్రయోజనాల కోసం లేని పదవులను పుట్టించుకుంటూ ప్రభుత్వ శాఖలను అనుకున్న దానికన్నా ఎక్కువగా భ్రష్ట పట్టిస్తున్నారని గుర్తు చేశారు.గ్రూప్ 1 ఉద్యోగాలలో జరిగిన అవకతవకల వల్ల నిరుద్యోగులు సుప్రీంకోర్టు వరకు వెళ్లారని ప్రభుత్వ ఆధిపత్యంతో కోర్టులలో వేయబడిన కేసులను కొట్టివేయించడానికి ఉపయోగించారు తప్ప నిజమైన ఆధారాలు గాని నిజమైన వాస్తవాలను గాని ప్రజాక్షేత్రంలో బయటపెట్టలేకపోయారని అట్టి నియామగా ప్రక్రియ ఫలితాలు లక్షల నిరుద్యోగులను పూర్తిస్థాయిలో నిరాశకు గురి చేశాయని వాటిని ఏమాత్రం పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వం తమ ఆధిపత్యాన్ని కొనసాగించడం కోసం అధికార హోదాను ఉన్నత స్థాయిలో ఉపయోగించుకున్నదన్నది నిరుద్యోగులు బాహాటంగా విమర్శిస్తున్న దాకలాలను రాష్ట్ర ప్రజల ముందుకు తీసుకొచ్చారు.ఏ రాష్ట్రంలోనైనా ఒకే సామాజిక వర్గానికి చెందిన నాయకులు ప్రజాప్రతినిధులు మంత్రులు ఎంపీలు ఎమ్మెల్యేలు అధికారులు రాష్ట్ర పరిధిలో ఎక్కువ స్థాయిలో కొనసాగితే రాష్ట్ర పరిస్థితులు సామాజిక న్యాయాన్ని కోల్పోతాయని అలాంటి సందర్భాల్లోనే ప్రజాస్వామ్య విలువలు పూర్తిగా అణిచివేయబడతాయని గుర్తు చేశారు.విద్యా విధానంలో రావలసిన మార్పులన్నీ ఆయా విశ్వవిద్యాలయ అధికారులు ఏకంగా (సీఎం రేవంత్ రెడ్డిని) విద్యాశాఖ మంత్రిని బూరెడి కొట్టించే ప్రయోగాలు చేస్తూ విశ్వవిద్యాలయాల్లో అవినీతి అక్రమార్కులను పెంచి పోషిస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి తీవ్రమైన అన్యాయం చేస్తూనే విద్యార్థులను అత్యున్నత స్థాయిలో వేధింపులకు గురి చేస్తున్నారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ప్రధానంగా రెడ్డి సామాజిక వర్గానికి చెందిన అధికారులు ఉన్నటువంటి ప్రాంతాల్లో విద్యార్థులు హరిగోశపడుతున్నారని హెచ్చరించారు.విద్యార్థులకు మేలు చేయాలేని అధికారులు తక్షణం వాళ్ళ పదవులకు రాజీనామాలు చేసి స్వచ్ఛందంగా విరమించుకోవాలని హితవు పలికారు.ఎక్కడ చూసినా అణిచివేత అనేది అంచలంచెలుగా పెరిగిపోతుందని నిజాయితీపరుల జాడ కనబడడానికి లక్షలలో ఒక్కరిని వెతుక్కోవాల్సి వస్తుందని అలాంటి పరిస్థితులు ప్రజాస్వామ్య రూపురేఖల్ని పూర్తిగా మార్చేస్తూ అక్రమార్కుల సామ్రాజ్యాన్ని అవినీతిపరుల సామ్రాజ్యాన్ని పెంచి పోషిస్తున్నట్లుగా ఉన్నాయని గుర్తు చేశారు.రాష్ట్ర ముఖ్యమంత్రి సీఎం రేవంత్ రెడ్డి ప్రతి శాఖపై పట్టు ఉన్నప్పటికీ తనను పూర్తిస్థాయిలో తప్పుతో పట్టిస్తున్న వ్యక్తుల శక్తుల సంపూర్తితో కూడిన పరిపక్వత ఆలోచనలను గుర్తించలేకపోతున్నారని రాష్ట్ర ప్రజలు అడుగుతున్నట్లు తెలిపారు.కుల రాజకీయాలకు స్వస్తి పలుకుతూ మత రాజకీయాలను పతనం చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా సామాజిక న్యాయాన్ని పాటిస్తూ ప్రజాస్వామ్య విలువలను కాపాడగలిగినప్పుడే తెలంగాణ రాష్ట్రంలో అన్ని కులాల ప్రజలకు అన్ని వర్గాల ప్రజలకు అన్ని మతాల ప్రజలకు సమన్యాయం జరుగుతుందని ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం సమన్యాయాన్ని పాటించడం కోసం తెలంగాణ రాష్ట్రంలో ఉన్న అన్ని పదవులలో అన్ని వర్గాలకు సముచిత అవకాశాలు దక్కించబడే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు.రాష్ట్రంలోని ప్రభుత్వ వ్యవస్థల్లో ఖాళీలుగా ఉన్న ఉద్యోగాలు అన్నిటిని భర్తీ చేయాలని నిరుద్యోగులను ఆదుకోవడంలో ఇప్పటికే ప్రభుత్వం ఎంతో వెనుకబాటుతనాన్ని ప్రదర్శించిందని ఇకనైనా నిరుద్యోగుల పట్ల సానుకూలతను కనపరుస్తూ ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఉద్యోగ నోటిఫికేషన్స్ విడుదల చేస్తూ నిరుద్యోగులను ఆదుకోవాలని పిలుపునిచ్చారు.

# వ్యవసాయాధికారి శ్రీహరి హత్య కేసు

**ప్రధాన నిందితుడు హరికృష్ణ కుటుంబంతో ఆత్మహత్య**

**ఒంగోలు,జూలై14(జై భీమ్ న్యూస్):**

ప్రకాశం జిల్లా వ్యవసాయ అధికారి శ్రీహరి హత్య కేసులో సంచలన పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న హరికృష్ణ, తన కుటుంబంతో కలిసి సింగరాయకొండ వద్ద రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న ఘటన కలకలం రేపింది. ఈ ఘటనలో హరికృష్ణ, అతని భార్యతో పాటు ఇద్దరు చిన్నారులు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. సమాచారం అందుకున్న రైల్వే, స్థానిక పోలీసులు ఘటనాస్థలికి చేరుకున్నారు. నలుగురి మృతదేహాలను స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు సాగిస్తున్నారు. పోలీసుల ప్రాథమిక విచారణలో.. ఆస్తి కోసం హరికృష్ణ తన సొంత బావ అయిన వ్యవసాయ అధికారి శ్రీహరిని హత్య చేసినట్లు వెల్లడైంది. ఈ కేసులో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేయడంతో తీవ్ర మనస్తాపానికి గురైన హరికృష్ణ కుటుంబంతో కలిసి ఈ నిర్ణయం తీసుకున్నట్లు అనుమానిస్తున్నారు. కాగా.. ఈ కేసు దర్యాప్తులో నిర్లక్ష్యంగా వ్యవహరించిన బుచ్చిరెడ్డిపాలెం సీఐ, ఎస్ఐలను నెల్లూరు జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల సస్పెండ్ చేశారు. అలాగే బుచ్చిరెడ్డిపాలెం పోలీస్ స్టేషన్‌కు చెందిన 23 మంది సిబ్బందిపై బదిలీ వేటు వేశారు. జూన్ 15న బుచ్చిరెడ్డిపాళెం మండల వ్యవసాయాధికారి శ్రీహరిని తన బావమరిది హరికృష్ణ కారులో పెంచలకోనకు తీసుకెళ్లారు. తిరిగి వస్తుండగా మార్గమధ్యలో శ్రీహరి మృతిచెందారు. గుండెపోటుతో చనిపోయినట్లు చిత్రీకరించారు. ఆయన శరీరంపై గాయాలున్నట్లు మృతుడి బంధువులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ మాతంగి శ్రీనివాసరావు పరిశీలించి వెళ్లిపోయారు. కేసు నమోదుగానీ, అనుమానితులను విచారించడంగానీ చేయలేదు. తన భర్త హత్యకు గురయ్యారని శ్రీహరి భార్య లావణ్య పీజీఆర్ఎస్‌లో జులై 6న ఫిర్యాదుచేశారు. దీనిపై ఎస్పీ అజిత.. విచారణ చేయాలని డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావును ఆదేశించారు. కుక్కలను చంపే ఇంజెక్షన్లు ఇచ్చి బావమరిది హరికృష్ణ.. ఆస్తికోసం శ్రీహరిని చంపేసినట్లు దర్యాప్తులో వెలుగు చూసింది. ఇదే కేసులో పోలీసుల నిర్లక్ష్యంపై బుచ్చిరెడ్డిపాళెం పీఎస్‌లోని సిబ్బంది 23 మందినీ ఒకేసారి జిల్లా ఎస్పీ బదిలీ చేశారు. సీఐను గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి వీఆర్‌కు పంపిస్తూ ఆదేశాలిచ్చారు.

# విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించేలా విద్యార్థులను తీర్చిదిద్దాలి





**ప్రభుత్వ క్రీడా పాఠశాల, జేఎన్ఎస్ స్టేడియం, స్విమ్మింగ్ పూల్‌ను ఆకస్మికంగా పరిశీలించిన జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి**

**హన్మకొండ, 14 జూలై 2026 (జై భీమ్ న్యూస్)**

విద్యార్థులు చదువులోనే కాకుండా క్రీడల్లోనూ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అధికారులకు సూచించారు. విద్యతో పాటు క్రీడా నైపుణ్యాలను సమానంగా అభివృద్ధి చేయడం ద్వారానే సమగ్ర వ్యక్తిత్వం కలిగిన విద్యార్థులు తయారవుతారని ఆమె అన్నారు. మంగళవారం జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం (జేఎన్ఎస్)లో యువజన సేవలు మరియు క్రీడల శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రభుత్వ క్రీడా పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి విద్యా ప్రమాణాలు, క్రీడా శిక్షణ, మౌలిక వసతులు, విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలను క్షుణ్ణంగా పరిశీలించారు. పాఠశాలలో నాలుగో, ఐదో తరగతి విద్యార్థులతో నేరుగా మాట్లాడిన కలెక్టర్ తెలుగు, ఆంగ్ల భాషలపై ప్రశ్నలు అడిగి వారి అభ్యాస స్థాయిని అంచనా వేశారు. జాతీయ జెండా విశిష్టత, అశోక ధర్మచక్రం ప్రాధాన్యతపై విద్యార్థులు ఇచ్చిన సమాధానాలను అభినందించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, కోచ్‌లతో మాట్లాడిన కలెక్టర్ ప్రతి విద్యార్థిలోని సహజ ప్రతిభను గుర్తించి ఆయా క్రీడల్లో ప్రత్యేక శిక్షణ అందించాలని సూచించారు. క్రీడా పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు భవిష్యత్తులో దేశానికి పతకాలు సాధించే క్రీడాకారులుగా ఎదగాలంటే శాస్త్రీయ శిక్షణతో పాటు నాణ్యమైన విద్య కూడా అందించాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులతో ఆత్మీయంగా మాట్లాడిన కలెక్టర్ వారికి అందిస్తున్న అల్పాహారం, మధ్యాహ్న భోజనం, పౌష్టికాహారం నాణ్యత, వసతి గృహాలు, ఇతర సౌకర్యాలపై వివరాలు తెలుసుకున్నారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని వసతులు కల్పించాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవీందర్ రెడ్డిని ఆదేశించారు. అనంతరం తరగతి గదులు, భోజనశాల, వంటశాల, వసతి గృహాలు, పరిశుభ్రత, మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించి అవసరమైన సూచనలు చేశారు. విద్యార్థులకు పరిశుభ్రమైన, పోషకాహారంతో కూడిన భోజనం అందేలా నిరంతర పర్యవేక్షణ ఉండాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా నాలుగో తరగతి విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేసిన కలెక్టర్ బాగా చదువుకోవడంతో పాటు క్రీడల్లోనూ రాణించి జిల్లా, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ప్రోత్సహించారు. తదనంతరం జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలోని జిమ్ హాల్, ఇండోర్ స్టేడియం, ఇతర క్రీడా మౌలిక వసతులను పరిశీలించారు. ఇండోర్ స్టేడియంలో సుమారు రూ.70 లక్షల వ్యయంతో చేపడుతున్న అభివృద్ధి పనుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనులను నాణ్యతతో పాటు నిర్ణీత గడువులో పూర్తి చేసి క్రీడాకారులకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు.

**స్విమ్మింగ్ పూల్ మరమ్మత్తులు త్వరగా పూర్తి చేయాలి**

అనంతరం జిల్లా యువజన సేవలు మరియు క్రీడల శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్విమ్మింగ్ పూల్‌ను సందర్శించిన కలెక్టర్ అక్కడ జరుగుతున్న మరమ్మత్తు, అభివృద్ధి పనులను పరిశీలించారు. వాటర్ పైప్‌లైన్ వ్యవస్థ, జిమ్ సెంటర్, ఇతర సదుపాయాల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. స్విమ్మింగ్ పూల్ మరమ్మత్తు పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. క్రీడాకారులు, ప్రజలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సేవలు వినియోగించుకునేలా నాణ్యతా ప్రమాణాలతో పనులు పూర్తి చేయాలని సూచించారు. భద్రతా ప్రమాణాలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు నిర్వహణను మరింత సమర్థవంతంగా చేపట్టాలని దిశానిర్దేశం చేశారు. నిర్వహణలో ఎలాంటి అంతరాయం లేకుండా నైపుణ్యం కలిగిన సిబ్బందిని నియమించాలని, తరచూ మరమ్మత్తులు అవసరం లేకుండా శాశ్వత పరిష్కారాలతో నిర్వహణ చేపట్టాలని అధికారులకు సూచించారు. అవసరమైతే సాంకేతిక నైపుణ్యం కలిగిన సిబ్బందిని నియమించాలని కూడా పేర్కొన్నారు. ఈ పరిశీలన కార్యక్రమంలో జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి ప్రశాంత్, జీడబ్ల్యూఎంసీ ఎస్ఈ రాజ్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మాధవి, రవికుమార్, డీఈ రాజ్‌కుమార్, యువజన సేవలు మరియు క్రీడల శాఖ అధికారులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



# సమాజ నిర్మాణంలో మ్యారేజ్ బ్యూరోలది కీలక పాత్ర







**మాజీ ఉప ముఖ్యమంత్రి డాక్టర్ తాటికొండ రాజయ్య**

**హైదరాబాద్(జై భీమ్ న్యూస్)**

సమాజంలో వివాహ వ్యవస్థను బలోపేతం చేయడంలో మ్యారేజ్ బ్యూరోలు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలంగాణ రాష్ట్ర తొలి మాజీ ఉప ముఖ్యమంత్రి డాక్టర్ తాటికొండ రాజయ్య అన్నారు. హైదరాబాద్‌లోని జనసాహిత్య అకాడమీ ఆడిటోరియంలో ఆల్ మ్యారేజ్ బ్యూరో అసోసియేషన్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ పాముల రమణ అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సమాజంలో వివాహాలు ఆలస్యమవడం, జాతి, మతం, ప్రాంతీయ భేదాలు, కుటుంబ పరిస్థితులు వంటి కారణాలతో అనేక మంది యువతీ యువకులు వివాహాలకు దూరమవుతున్నారని పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో మ్యారేజ్ బ్యూరోలు సరైన వధూవరులను ఒక వేదికపైకి తీసుకువచ్చి వారి జీవితాల్లో కొత్త ఆశలు, ఆనందాన్ని నింపుతూ కుటుంబ వ్యవస్థను బలోపేతం చేస్తున్నాయని కొనియాడారు. సమాజానికి సేవ చేస్తున్న మ్యారేజ్ బ్యూరోల కృషిని ప్రభుత్వం గుర్తించాలని, మహిళల భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ కుటుంబ విలువలను పరిరక్షించడంలో ఈ సంస్థలు విశేష సేవలు అందిస్తున్నాయని తెలిపారు. డాక్టర్ బి.ఎల్. అంబేడ్కర్ మాట్లాడుతూ, మారుతున్న సామాజిక పరిస్థితులకు అనుగుణంగా మ్యారేజ్ బ్యూరోలు తమ సేవలను మరింత విస్తరించాలని సూచించారు. కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ వంటి ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు, వృద్ధులు, వికలాంగులు, ఒంటరి మహిళలకు కూడా ప్రత్యేక సేవలు అందించేలా కార్యాచరణ రూపొందించాలని కోరారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన పలువురు మ్యారేజ్ బ్యూరో నిర్వాహకులు, సామాజిక సేవకులకు నంది అవార్డ్స్‌తో పాటు పలు ప్రతిష్ఠాత్మక అవార్డులను ప్రదానం చేశారు. అవార్డులు అందుకున్న వారు తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తూ, ఇది తమ జీవితంలో మరువలేని గౌరవమని, సమాజ సేవకు లభించిన గుర్తింపుగా భావిస్తున్నామని తెలిపారు. భవిష్యత్తులో మరింత బాధ్యతతో సేవలు అందిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ వాదులు, ఎంఆర్పీఎస్ మ్యారేజ్ బ్యూరోస్ తెలుగు రాష్ట్రాల ప్రతినిధులు, వివిధ జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర కమిటీ సభ్యులు, జై భీమ్ టీవీ ఫౌండర్, చైర్మన్ డాక్టర్ బరిగెల శివ, రాజా ఇన్‌ఫ్రా డెవలపర్స్ అధినేత ఎస్.ఎస్. రాజు, రాష్ట్ర మహిళా చైర్‌పర్సన్ భారతి దేవి, నూతి చంద్రమౌళి, రాజలింగం, క్రాంతి కుమార్, పాముల అనిల్, శ్రీకాంత్, హరీష్, మురళి తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఫీజు రియంబర్స్మెంట్ స్కీమును రద్దు చేయాలనే ప్రభుత్వ కుట్రను విరమించుకోవాలి



**కూకట్ పల్లి న్యూస్ జూలై 14 జై భీమ్ న్యూస్**

ఫీజు రియంబర్స్మెంట్ స్కీమును రద్దు చేయాలనే ప్రభుత్వ కుట్రను విరమించుకోవాలి, ఫీజుల బకాయిల 8వేల కోట్లు వెంటనే విడుదల చేయాలని, పాత విధానం కొనసాగించాలని ఇంద్ర పార్క్ ధర్నా చౌక్ వద్ద సత్యాగ్రహ దీక్షను జాతీయ బీసీ సంక్షేమ సంఘం, జాతీయ అధ్యక్షులు రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి తెలంగాణ బీసీ విద్యుత్ ఉద్యోగాల సంస్థ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు జి బ్రహ్మేంద్ర, తెలంగాణ రాష్ట్ర బీసీ నాయకులు జర్నలిస్టు తెల్ల హరికృష్ణ, గుజ్జ సత్యం, నీలగోపాల్, మల్లేష్ యాదవ్, రామ్మూర్తి గౌడ్, పృధ్వి గౌడ్, నిఖిల్, గోపాల్, సిహెచ్ ప్రకాష్, ఉద్యమ గాయకులు రామలింగం బృందం తదితరులు పాల్గొని మద్దతు తెలిపారు.

## కాకతీయ విశ్వవిద్యాలయ పరిశోధకురాలు పల్లవి జేరుపోతులకు డాక్టరేట్ ప్రదానం

**కె యూ, 14 జూలై 2026 (జై భీమ్ న్యూస్)**



కాకతీయ విశ్వవిద్యాలయం రసాయన శాస్త్ర విభాగానికి చెందిన పరిశోధకురాలు పల్లవి జేరుపోతులకు డాక్టరేట్‌ను విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య రాజేందర్ కట్ల ప్రకటించారు. "2-అమినోథియాజోల్ ఆధారిత జీవసామర్థ్య హెటెరోసైక్లిక్ సమ్మేళనాలు: సంశ్లేషణ, లక్షణ నిర్ధారణ, జీవసంబంధిత మూల్యాంకనం మరియు మాలిక్యులర్ డాకింగ్ అధ్యయనాలు" అనే పరిశోధన అంశంపై ఆమె తన పరిశోధనను విజయవంతంగా పూర్తి చేశారు. ఈ పరిశోధనను రసాయన శాస్త్ర విభాగ ఆచార్యులు ఆచార్య జి. హనుమంతు పర్యవేక్షణలో పూర్తి చేశారు. ములుగు మండలంలోని బండారుపల్లి గ్రామానికి చెందిన డాక్టర్ పల్లవి జేరుపోతులకు డాక్టరేట్ లభించిన సందర్భంగా విశ్వవిద్యాలయ బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియలో రేషన్ డీలర్ల సహకారం కీలకం: అదనపు కలెక్టర్ ఎన్. రవి



**హన్మకొండ, 14 జూలై 2026(జై భీమ్ న్యూస్)**

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను జిల్లాలో విజయవంతంగా పూర్తి చేయడంలో రేషన్ డీలర్లు కీలక పాత్ర పోషించాలని హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి పిలుపునిచ్చారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని అదనపు కలెక్టర్ ఛాంబర్‌లో హనుమకొండ, కాజీపేట, హసన్‌పర్తి మండలాల రేషన్ డీలర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం చేయడం, ఓటర్ల భాగస్వామ్యాన్ని పెంచడం, గణన ఫారాల సేకరణపై చేపట్టాల్సిన చర్యలపై సమావేశంలో సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ఎన్. రవి మాట్లాడుతూ, ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌వోలు) ఇప్పటికే ఓటర్లకు గణన (ఎన్యూమరేషన్) ఫారాలను అందజేశారని తెలిపారు. ఓటర్లు పూర్తి చేసిన ఫారాలను తిరిగి బీఎల్‌వోలకు అందించేలా రేషన్ డీలర్లు చొరవ తీసుకోవాలని సూచించారు. తమ పరిధిలోని ప్రతి అర్హ ఓటరు ఎస్ఐఆర్ ప్రక్రియలో పాల్గొనేలా అవగాహన కల్పించి సహకరించాలని కోరారు. అదేవిధంగా, ఒకే వ్యక్తి రెండు చోట్ల ఓటరు నమోదై ఉండటం ఎన్నికల చట్టాల ప్రకారం నేరమని, అలాంటి పరిస్థితులు తలెత్తకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఓటర్ల జాబితాను పారదర్శకంగా, తప్పుల్లేకుండా రూపొందించేందుకు అందరూ సమన్వయంతో పనిచేయాలని ఆయన అన్నారు. జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియను నిర్దేశిత గడువులో విజయవంతంగా పూర్తి చేయడానికి రేషన్ డీలర్లు, బీఎల్‌వోలు, సంబంధిత అధికారులు సమిష్టిగా కృషి చేయాలని అదనపు కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సివిల్ సప్లై కార్పొరేషన్ జిల్లా మేనేజర్ మహేందర్, రేషన్ డీలర్ల సంఘం ప్రతినిధులు రమేష్‌బాబు, మోహన్‌తో పాటు హనుమకొండ, కాజీపేట, హసన్‌పర్తి మండలాల రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE Jai Bheem

# తెలంగాణలో బీఎస్పీయే ప్రత్యామ్నాయం: ఇబ్రాం శేఖర్

**అక్టోబర్ 9న హైదరాబాద్‌లో జరిగే బీఎస్పీ బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపు**






**హైద్రాబాద్, 14 జూలై 2026(జై భీమ్ న్యూస్)**

తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలకు ప్రత్యామ్నాయం బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) మాత్రమేనని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఇబ్రాం శేఖర్ పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఎస్పీని అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా పార్టీ వ్యూహాత్మకంగా ముందుకు సాగుతోందని తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లోని బీఎస్పీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశానికి పార్టీ జాతీయ నేతలు, రాష్ట్ర చీఫ్ సెంట్రల్ కో-ఆర్డినేటర్లు అథర్ సింగ్ రావ్, సురేష్ ఆర్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జాతీయ నేతలు మాట్లాడుతూ, పార్టీని గ్రామస్థాయికి విస్తరించి బహుజన సమాజాన్ని రాజకీయ అధికార దిశగా నడిపించాలని సూచించారు. పార్టీ నిర్మాణాన్ని బలోపేతం చేస్తూ ప్రజల్లో మరింత చైతన్యం తీసుకురావాలని పార్టీ నాయకులకు పిలుపునిచ్చారు. అనంతరం ఇబ్రాం శేఖర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వ పాలనపై విమర్శలు చేశారు. నేరెళ్ల బాధితులకు న్యాయం చేయడంలో బీఎస్పీ మాత్రమే కట్టుబడి ఉందని, తమ పార్టీ అధికారంలోకి వస్తే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల ప్రజలు బీఎస్పీకి మద్దతు ఇచ్చి అధికారంలోకి తీసుకురావాలని కోరారు. వచ్చే ఎన్నికల్లో బీఎస్పీ విజయానికి కార్యాచరణ రూపొందిస్తున్నామని, అక్టోబర్ 9న హైదరాబాద్‌లో నిర్వహించనున్న బీఎస్పీ భారీ బహిరంగ సభను కనీవినీ ఎరుగని రీతిలో విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు, చీఫ్ జోన్-4 ఇన్‌చార్జి శ్రీరాం కృష్ణ, చీఫ్ జోన్ ఇన్‌చార్జిలు దాగిల్ల దయానంద్ రావు, బోడపట్ల ఈశ్వర్, నిశాని రాంచందర్, ప్రధాన కార్యదర్శులు గుండెల ధర్మేందర్, రవీందర్ నాయక్, బండి పృథ్వీరాజ్, కార్యదర్శులు లింగంపల్లి యాదగిరి, అనితా రెడ్డి, అంతటి నాగన్న, కోశాధికారి ప్రణయ్, పార్లమెంట్ ఇన్‌చార్జిలు, వివిధ జిల్లాల అధ్యక్షులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ శిక్షణా కార్యక్రమాన్ని పరిశీలించిన అదనపు కలెక్టర్ నిడగుగొమ్ముల రవి



**హన్మకొండ, 14 జూలై 2026(జైభీమ్ న్యూస్)**

హనుమకొండ జిల్లా సుబేదారి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న సోషల్ స్టడీస్ సమగ్ర ఇన్-సర్వీస్ ఉపాధ్యాయ శిక్షణ (ఇంటిగ్రేటెడ్ ఇన్-సర్వీస్ టీచర్ ట్రైనింగ్ -- స్పెల్-1) కార్యక్రమాన్ని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) నిడగుగొమ్ముల రవి మంగళవారం సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా శిక్షణలో పాల్గొంటున్న ఉపాధ్యాయులతో ఆయన మాట్లాడారు. విద్యార్థి కేంద్రిత బోధన, ఆధునిక బోధనా విధానాల అమలు, నాణ్యమైన విద్య అందించడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను తరగతి గదిలో సమర్థవంతంగా అమలు చేసి విద్యార్థుల్లో విషయ పరిజ్ఞానం, విశ్లేషణాత్మక ఆలోచన, సామాజిక అవగాహన పెంపొందేలా కృషి చేయాలని సూచించారు. శిక్షణా కార్యక్రమం నిర్వహణ తీరును, రిసోర్స్ పర్సన్లు అందిస్తున్న బోధనను పరిశీలించిన అదనపు కలెక్టర్, ఇటువంటి శిక్షణలు ఉపాధ్యాయుల నైపుణ్యాలను మెరుగుపరచడంతో పాటు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల పెంపునకు దోహదపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్.వి. గిరిరాజ్ గౌడ్, కేంద్ర ఇన్‌చార్జి నెహ్రూ నాయక్, జిల్లా నాణ్యత సమన్వయకర్త (ఏఎంఓ) డా. బండారు మన్మోహన్, రిసోర్స్ పర్సన్లు, సోషల్ స్టడీస్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ప్రజలకు సత్వర న్యాయం అందేలా కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలి: వరంగల్ సీపీ ఎన్. శ్వేత





**రూ.50 లక్షల విలువైన 352 పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను బాధితులకు అందజేత**

**వరంగల్, 14 జూలై 2026(జై భీమ్ క్రైమ్ న్యూస్)**

ప్రజలకు సత్వర న్యాయం అందించడమే పోలీసు శాఖ ప్రధాన లక్ష్యమని, ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు నిర్వహించి పెండింగ్ కేసులను త్వరితగతిన పూర్తి చేయాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్ అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక కాకతీయ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (కిట్స్) కళాశాల సమావేశ మందిరంలో వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పోలీసు అధికారులతో నెలవారీ నేర సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో కమిషనరేట్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న వివిధ రకాల నేరాలు, వాటి దర్యాప్తు పురోగతి, కేసుల ఛేదన, శాంతిభద్రతల పరిస్థితి, మహిళలు, చిన్నారులపై జరిగే నేరాల నివారణ, సైబర్ నేరాల నియంత్రణ, మాదకద్రవ్యాల నిర్మూలన, ట్రాఫిక్ నిర్వహణ తదితర అంశాలపై పోలీస్ కమిషనర్ సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్. శ్వేత మాట్లాడుతూ, పెండింగ్‌లో ఉన్న కేసులను వేగంగా పూర్తి చేయడంతో పాటు నిందితుల అరెస్టుపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. చోరీ కేసుల్లో స్వాధీనం చేసుకున్న సొత్తును చట్టపరమైన ప్రక్రియ పూర్తైన వెంటనే బాధితులకు అందజేయాలని అధికారులను ఆదేశించారు. మాదకద్రవ్యాల నియంత్రణలో భాగంగా పాఠశాలల పరిసరాల్లో గుట్కా, సిగరెట్లు, ఇతర పొగాకు ఉత్పత్తుల విక్రయాలను పూర్తిగా అరికట్టేందుకు ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని సూచించారు. ప్రజల నుంచి అందే ప్రతి పిటిషన్‌ను తప్పనిసరిగా నమోదు చేసి, వెంటనే విచారణ అధికారిని నియమించి నిర్ణీత గడువులో నాణ్యమైన విచారణ పూర్తి చేయాలని తెలిపారు. అలాగే డయల్-100 ద్వారా వచ్చే ప్రతి ఫిర్యాదుపై తక్షణమే స్పందించి బాధితులకు సకాలంలో సేవలు అందించాలని ఆదేశించారు. అందుబాటులో ఉన్న మానవ వనరులను సమర్థవంతంగా వినియోగిస్తూ సమర్థవంతమైన పోలీసింగ్ అమలు చేయాలని సీపీ పేర్కొన్నారు. భూ వివాదాలకు సంబంధించిన కేసుల్లో స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్ఓపీ)లను ఖచ్చితంగా పాటించాలని, శాంతిభద్రతలకు భంగం కలిగించే వ్యక్తులపై నిరంతర నిఘా ఉంచి అవసరమైన చోట రౌడీ షీట్లు తెరవాలని సూచించారు. ప్రజల భద్రతే పోలీస్ శాఖ ప్రధాన బాధ్యత అని స్పష్టం చేశారు.

**352 పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను బాధితులకు అందజేత**

అనంతరం వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో చోరీకి గురైన లేదా పోగొట్టుకున్న సుమారు రూ.50 లక్షల విలువైన 352 మొబైల్ ఫోన్లను సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ (సీఈఐఆర్) పోర్టల్ ద్వారా ట్రాక్ చేసి స్వాధీనం చేసుకున్న పోలీసులు, వాటిని బాధితులకు పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా సెల్‌ఫోన్ పోగొట్టుకున్న లేదా చోరీకి గురైన బాధితులు తప్పనిసరిగా సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేయాలని సీపీ సూచించారు. పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను గుర్తించి బాధితులకు తిరిగి అందించడంలో విశేష ప్రతిభ కనబరిచిన ఐటీ సెల్ బృందాన్ని ఆమె అభినందించారు. ఈ సమావేశంలో డీసీపీలు అకింత్ కుమార్, ధారా కవిత, రాజమహేంద్ర నాయక్, కిషోర్ సింగ్, అదనపు డీసీపీలు, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, స్టేషన్ హౌస్ అధికారులు (ఎస్‌హెచ్‌వోలు), ప్రత్యేక విభాగాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# డీఈఈసెట్-2026 స్పాట్ అడ్మిషన్ల షెడ్యూల్ విడుదల




**హన్మకొండ, 14 జూలై 2026(జై భీమ్ న్యూస్)**

తెలంగాణ డీఈఈసెట్--2026 ద్వారా 2026--28 విద్యా సంవత్సరానికి డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డీఈఎల్ఎడ్) రెండేళ్ల కోర్సుల్లో మిగిలిన సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్ల షెడ్యూల్‌ను ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణ సంస్థ (డైట్), వరంగల్--హనుమకొండ జిల్లా విడుదల చేసింది. ఈ మేరకు డైట్ ప్రిన్సిపాల్ బి. రంగయ్య నాయకుడు మంగళవారం ఒక ప్రకటనలో వివరాలు వెల్లడించారు. డీఈఈసెట్--2026లో అర్హత సాధించి ఇప్పటివరకు ఏ కళాశాలలోనూ సీటు పొందని అభ్యర్థులు మాత్రమే స్పాట్ అడ్మిషన్లకు అర్హులని తెలిపారు. ప్రభుత్వ డీఈఎల్ఎడ్ కళాశాలల్లో జూలై 16, 17 తేదీల్లో మధ్యాహ్నం 2 గంటల వరకు, ప్రైవేట్ డీఈఎల్ఎడ్, డీపీఎస్ఈ కళాశాలల్లో జూలై 18 నుంచి 21 వరకు మధ్యాహ్నం 2 గంటల వరకు స్పాట్ అడ్మిషన్ల కోసం దరఖాస్తులు స్వీకరిస్తామని పేర్కొన్నారు. అభ్యర్థులు డీఈఈసెట్--2025 ర్యాంక్ కార్డు, ఎస్ఎస్‌సీ మెమో, ఇంటర్మీడియట్ మెమో, నాలుగు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు, ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్ (టీసీ), కుల, ఆదాయ లేదా ఈడబ్ల్యూఎస్ ధ్రువపత్రాలు, అవసరమైతే ఎన్‌సీసీ, దివ్యాంగుల ధ్రువపత్రాలతో సంబంధిత కళాశాలలకు హాజరు కావాలని సూచించారు. ప్రభుత్వ కళాశాలల్లో జూలై 18న, ప్రైవేట్ కళాశాలల్లో జూలై 22న స్పాట్ అడ్మిషన్ల జాబితాను విడుదల చేసి ప్రవేశాలు పూర్తి చేయనున్నట్లు తెలిపారు. డీఈఈసెట్--2026 అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్న ఖాళీ సీట్ల వివరాలను పరిశీలించి, అభ్యర్థులు తమకు నచ్చిన కళాశాలలో నిబంధనల ప్రకారం స్పాట్ అడ్మిషన్ పొందాలని ప్రిన్సిపాల్ బి. రంగయ్య నాయకుడు సూచించారు.

## ఉపాధ్యాయుల సామర్థ్యాభివృద్ధి శిక్షణలను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్ డా. సత్యశారద

**నాణ్యమైన విద్యకు ఆధునిక బోధనా విధానాల అమలే కీలకం**



**హన్మకొండ, 14 జూలై 2026(జై భీమ్ న్యూస్)**

జిల్లాలో ఉపాధ్యాయుల బోధనా నైపుణ్యాలను మరింత మెరుగుపరచి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి సామర్థ్యాభివృద్ధి (కెపాసిటీ బిల్డింగ్ ప్రోగ్రామ్) శిక్షణలను జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ డా. సత్యశారద మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జీహెచ్ఎస్ కరీంబాద్, జీహెచ్ఎస్ శంభునిపేట్ శిక్షణ కేంద్రాలను సందర్శించి శిక్షణ నిర్వహణ తీరును పరిశీలించారు. శిక్షణ తరగతులను ప్రత్యక్షంగా వీక్షించిన కలెక్టర్, వివిధ సబ్జెక్టులకు చెందిన ఉపాధ్యాయులతో మాట్లాడి బోధనా విధానాలు, విద్యార్థుల అభ్యాస స్థాయిని పెంపొందించే వ్యూహాలు, తరగతి గది నిర్వహణ, కార్యాచరణ ఆధారిత బోధన, అభ్యాస ఫలితాల సాధన వంటి అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. ఈ శిక్షణల్లో సాంఘిక శాస్త్రం, ఫిజికల్ సైన్స్, స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లీష్, హిందీ, ఎస్‌జీటీ, ఎంఆర్‌పీఎస్, ఉర్దూ మీడియం ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ డా. సత్యశారద మాట్లాడుతూ, "ఉపాధ్యాయుడే విద్యార్థి భవిష్యత్తుకు శిల్పి. ఉపాధ్యాయులు నిరంతరం తమ జ్ఞానాన్ని, బోధనా నైపుణ్యాలను మెరుగుపరుచుకుంటేనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించగలుగుతారు. శిక్షణలు కేవలం హాజరు నమోదుకే పరిమితం కాకుండా తరగతి గదిలో బోధనలో స్పష్టమైన మార్పు తీసుకురావాలి" అని అన్నారు. విద్యార్థుల అభ్యాస స్థాయిని గుర్తించి వారి అవసరాలకు అనుగుణంగా బోధనను రూపొందించాలని, పాఠ్యాంశాలను సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ కార్యాచరణ ఆధారితంగా బోధించాలని సూచించారు. విద్యార్థుల్లో ఆలోచనా శక్తి, విశ్లేషణ సామర్థ్యం, సమస్య పరిష్కార నైపుణ్యాలను పెంపొందించేలా బోధన ఉండాలని, పరీక్షలకే పరిమితం కాకుండా జీవిత నైపుణ్యాలను కూడా అభివృద్ధి చేసే విధంగా విద్య అందించాలని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఖాన్ అకాడమీ డిజిటల్ లెర్నింగ్, లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రామ్ (ఎల్ఐపీ), ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ (ఎఫ్ఎల్ఎన్), డిజిటల్ లెర్నింగ్ కార్యకలాపాలు, ఎక్సల్ ఆధారిత అభ్యాసం, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత బోధన, లైబ్రరీ కార్నర్స్ వంటి అన్ని అకడమిక్ కార్యక్రమాలను ప్రతి పాఠశాలలో సమర్థవంతంగా అమలు చేయాలని ఉపాధ్యాయులకు ఆదేశించారు. శిక్షణలో నేర్చుకున్న వినూత్న బోధనా పద్ధతులు, డిజిటల్ వనరులను తరగతి గదిలో తప్పనిసరిగా అమలు చేసి ప్రతి విద్యార్థి అభ్యాస ఫలితాలను మెరుగుపరిచే దిశగా కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వం ఉపాధ్యాయుల వృత్తి నైపుణ్యాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, ఈ శిక్షణలను ప్రతి ఉపాధ్యాయుడు సద్వినియోగం చేసుకుని జిల్లాను విద్యా రంగంలో ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గణేష్, జిల్లా విద్యాశాఖ అధికారి రంగయ్యనాయుడు, అకడమిక్ మానిటరింగ్ అధికారి ఉంద్రాతి సుజన్ తేజ, ఉల్లాస్ కోఆర్డినేటర్ నాగేశ్వర్ రావు, డీఆర్‌పీలు, సీఆర్‌పీలు, ఉపాధ్యాయులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# గన్‌తో వ్యక్తి హల్‌చల్ చేయడంతో ఆందోళన

**మాల్‌పై కేసు నమోదు చేసిన పోలీసులు**

హైదరాబాద్,జూలై14(జై భీమ్ న్యూస్): కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్ పరిధిలోని లులు మాల్‌లో ఓ వ్యక్తి గన్‌తో కనిపించడం కలకలం రేపింది. మాల్ పార్కింగ్ వద్ద రెండు కుటుంబాల మధ్య ఘర్షణ జరిగింది. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని ఇరువర్గాలకు నచ్చచెబుతుండగా పాతబస్తీకి చెందిన సిద్దిఖీ అనే వ్యక్తి జేబులో గన్‌ను పోలీసులు గుర్తించారు. సిద్దిఖీ దగ్గర గన్ కనిపించడంతో అప్రమత్తమైన పోలీసులు స్వాధీనం చేసుకుని పరిశీలించారు. కాగా గన్‌కు చెల్లుబాటయ్యే లైసెన్స్ ఉన్నట్లు తేలింది. అయితే గన్‌తో వచ్చిన వ్యక్తిని మాల్‌లోకి అనుమతించడంలో భద్రతా సిబ్బంది నిర్లక్ష్యంపై పోలీసులు సీరియస్ అయ్యారు. మాల్‌లోకి ప్రవేశించేప్పుడు సరైన తనిఖీలు నిర్వహించకపోవడం వల్లే సదరు వ్యక్తి గన్‌తో లోపలికి రాగలిగారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన లులు మాల్ యాజమాన్యంపై కేసు నమోదు చేశారు. మాల్ ప్రవేశ ద్వారం వద్ద భద్రతా సిబ్బంది సరైన తనిఖీలు నిర్వహించకపోవడం వల్లే గన్‌తో సదరు వ్యక్తి లోపలికి వెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. సాధారణంగా మాల్స్‌లో మెటల్ డిటెక్టర్లు, బ్యాగ్ స్కానింగ్ వంటి భద్రతా చర్యలు తప్పనిసరిగా అమలు చేయాల్సి ఉంది. కానీ ఈ ఘటనలో భద్రతపరంగా నిర్లక్ష్యం జరిగింది. నేపథ్యంలో భద్రతా నిబంధనలను ఉల్లంఘించి నందుకు లులు మాల్ యాజమాన్యంపై పోలీసులు కేసు నమోదు చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా భద్రతా వ్యవస్థను మరింత కట్టుదిట్టం చేయాలని అధికారులు సూచించారు. ఈ ఘటన నగరంలోని ప్రముఖ షాపింగ్ మాల్స్‌లో భద్రతా ఏర్పాట్లపై మరోసారి చర్చకు దారితీసింది. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని అన్ని మాల్స్‌లో భద్రతా తనిఖీలను ఖచ్చితంగా అమలు చేయాల్సిన అవసరం ఉందని అధికారులు పేర్కొంటున్నారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE
సమస్యలపై సమరంగా Jai Bheem TV STRUGGLE FOR JUSTICE సామాన్యుడి ఆయుధంగా

# డేటా డ్రివెన్ గవర్నెన్స్‌తో రియల్ టైమ్ రిజల్ట్స్

**నెలవారీ ఆర్థిక నివేదికలతో ఆశించిన పురోగతి**
**అర్జీల పరిష్కారం, క్షేత్ర స్థాయి పర్యటనలు తప్పనిసరి**
**ఎల్‌నినో ప్రభావంపై రైతులకు అవగాహన కల్పించాలి**
**మంత్రులు, కార్యదర్శుల సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు**

**అమరావతి, జూలై 14 (జై భీమ్ న్యూస్):**



డేటా డ్రివెన్ గవర్నెన్సుతో రియల్ టైమ్ రిజల్ట్స్ సాధించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్దేశించారు. డేటా డ్రివెన్ గవర్నెన్సు ఆధారంగా పాలనను మరింత సులభతరం చేయాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని సీఎం అన్నారు. దీని కోసం దేశంలోనే మొదటిసారిగా మంత్లీ ఎకనామిక్ రిపోర్టుల ద్వారా వృద్ధిని సమీక్షించుకుంటున్నామని తెలిపారు. ఇక నుంచి ప్రతీ నెలా... నెలవారీ ఆర్థిక నివేదికలను విడుదల చేస్తామని దానికి అనుగుణంగా రాష్ట్ర పురోగతి కోసం ప్రభుత్వ శాఖలు పనిచేయాలని సీఎం  స్పష్టం చేశారు. సచివాలయంలో మంగళవారం మంత్రులు, కార్యదర్శులు, విభాగాధిపతులతో ఎంఈఆర్‌పై నిర్వహించిన సమావేశంలో సీఎం అధికారులకు దిశానిర్దేశం చేశారు. నెలవారీ ఆర్థిక నివేదికల ద్వారా ఎప్పటికప్పుడు రెవెన్యూ రాబడులను అంచనా వేసేందుకు ఆస్కారం ఉంటుందన్నారు. అధికారులు, ఉద్యోగుల నెలవారీ పనితీరును, నైపుణ్యాలను కూడా ఎప్పటికప్పుడు అంచనా వేసుకుని ముందుకు వెళ్తామన్నారు. ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."2019-2024 మధ్య అన్ని వ్యవస్థలు చిన్నాభిన్నం అయ్యాయి. రాష్ట్రంలో విధ్వంసం జరిగింది. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన కోసం రెండేళ్లుగా సమిష్టిగా పనిచేసాం. ప్రభుత్వ ఆలోచనల్ని అధికార యంత్రాంగం సమర్ధంగా అమలు చేసింది. క్షేత్రస్థాయిలో ఆశించిన మార్పుల్ని కొంతవరకు సాధించగలిగాం. మరిన్ని రంగాల్లో మరింతగా మెరుగుపడాలి. వికసిత్ భారత్ లక్ష్యాలకు అనుగుణంగా స్వర్ణాంధ్ర-2047 విజన్ రూపకల్పన చేశాం. తలసరి ఆదాయం, జీఎస్డీపీ లక్ష్యాలను నిర్దేశించుకున్నాం. సుపరిపాలన అందించేలా ప్రతీ సోమవారం ఆర్టీజీఎస్ నుంచి సమీక్షలతో పాటు 4 సార్లు మంత్రులు, కార్యదర్శుల సమావేశాలు, 7 సార్లు కలెక్టర్ల సదస్సులు నిర్వహించాం. 19 ఎస్ఐపీబీ సమావేశాలు, 52 కేబినెట్ సమావేశాల ద్వారా పెట్టుబడులకు ఆమోదం తెలిపాం. గత పాలనలో ఏపీపై పారిశ్రామికవేత్తలకు నమ్మకం పోయింది. మేం అధికారంలోకి వచ్చాక పరిస్థితిలో మార్పు తెచ్చాం. దేశంలోనే అత్యధిక పెట్టుబడులు ఆకర్షించాం. ఏపీ పెట్టుబడులకు అత్యుత్తమ గమ్యస్థానంగా మారింది. పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు పెరిగాయి. వనరుల్ని సమర్ధంగా వినియోగించుకోవాలన్నదే మా ప్రభుత్వ లక్ష్యం. ఏపీని పారిశ్రామికంగా అగ్రగామిగా నిలబెట్టాలనే ఆలోచనతో పనిచేస్తున్నాం. రాయలసీమ, ఉత్తరాంధ్ర, కోస్తాంధ్ర ఇలా అన్ని జిల్లాల్లో అపారమైన వనరులు, పెట్టుబడి అవకాశాలు ఉన్నాయి. రేర్ ఎర్త్ మినరల్స్, సిలికా, గ్రానైట్ , బాక్సైట్ సహా విలువైన వనరులను వాల్యూ అడిషన్ చేసేలా ప్రణాళికలు రూపొందించాం. ఇన్నోవేషన్ ద్వారా మెరుగైన ఫలితాలను సాధించేందుకు అవకాశం ఉంది. టెక్నాలజీ, వనరులు, నాలెడ్జి మన దగ్గర ఉన్నాయి. దానిని అందిపుచ్చుకునే నాయకత్వం మనకు కావాలి. పాలసీలు తీసుకురావటం సులభమే అయినా వాటిని అమలు చేయటమే అత్యంత కీలకం. ఇక నుంచి నెల వారీ ఆర్థిక నివేదికల ద్వారా ముందుకు వెళ్లాలని నిర్ణయించాం. ప్రతీ నెలా ఒకసారి కార్యదర్శులు, హెచ్‌వోడీల సమావేశం ద్వారా ఎప్పటికప్పుడు పురోగతిని సమీక్షించుకుందాం." అని ముఖ్యమంత్రి అన్నారు.

### అర్జీలు వేగంగా పరిష్కరించి ప్రజలకు స్వాంతన

'గత పాలనలో కొన్ని ప్రభుత్వ శాఖల్లో పనితీరు మెరుగ్గా లేకపోవటంతో ప్రజల నుంచి పెద్దఎత్తున అర్జీలు వచ్చాయి. పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టమ్ ద్వారా ఈ అర్జీలను వేగంగా పరిష్కరించి ప్రజలకు స్వాంతన కలిగించాలి. గత పాలకుల వల్ల రెవెన్యూ శాఖలో అధికంగా ఫిర్యాదులు వచ్చాయి. భూ వివాదాలకు సంబంధించిన అర్జీలను పరిష్కరించేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాల్సి వచ్చింది. పీజీఆర్ఎస్‌లో జీరో పెండెన్సీ అనేది లక్ష్యం కావాలని అన్ని శాఖలకూ నిర్దేశిస్తున్నాను. శెట్టిపల్లి, వట్టిచెరుకూరు, కంగుంది, గుటుపల్లి లాంటి ప్రాంతాల్లో భూ సమస్యల్ని పరిష్కరించాం. రీసర్వే ప్రక్రియ ద్వారా రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను ప్రతీ నెలా 9 తేదీన పంపిణీ చేస్తున్నాం. ఇంకా 72 లక్షల పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేయాల్సి ఉంది. ప్రభుత్వ శాఖలు ఆర్జీల పరిష్కారం కోసం నిబంధనల్లో మార్పులు తీసుకురావడం, లేదంటే చట్టాలను సవరించే అంశంపై విశ్లేషణ చేయాలి. మెరుగ్గా పనిచేస్తే 15 శాతం వృద్ధి రేటును సాధించే అవకాశం ఉంది. పాలన సులభతరం చేసేందుకు, రెవెన్యూ వసూళ్లు పెంచుకునేలా కొన్ని ఏఐ టూల్స్ కూడా రూపొందించాం. ఈ ఏడాది వివిధ ప్రభుత్వ శాఖల్లో 24 శాతం మేర రెవెన్యూ వసూళ్లు పెరిగాయి. జీఎస్డీపీ వృద్ధిరేటు 2017తో పోలిస్తే గత ఏడాదిలో 20 శాతం మేర పెరిగింది. కీలకస్థానాల్లో పనిచేస్తున్న కొందరు వ్యక్తులు అభివృద్ధి నిరోధకులుగా పనిచేయటం సరికాదని హెచ్చరిస్తున్నానను.' అని ముఖ్యమంత్రి అన్నారు.

### నాలుగు గోడలు దాటి వెళ్లాలి

ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలోనూ పర్యటించాలి. ప్రజల సమస్యలు, వాస్తవాలు తెలియాలంటే క్షేత్రస్థాయికి వెళ్లాల్సిందే. వినూత్న ఆలోచనలతోనే సుపరిపాలనను క్షేత్రస్థాయికి తీసుకువెళ్లాలి. మూడో ఏడాదిలోకి అడుగు పెట్టినప్పటికీ విద్యుత్ ఛార్జీలను పెంచలేదు. ఐదేళ్ల పాటు విద్యుత్ ఛార్జీలు పెంచేది లేదని చెప్పిన మాటను నిలబెట్టుకున్నాం. తొలిసారి ట్రూ డౌన్‌ను కూడా అమలు చేస్తున్నాం. పట్టిసీమ నీటితో గోదావరి నుంచి కృష్ణా డెల్టా ఆయకట్టుకు నీరు అందించగలుగుతున్నాం. రాష్ట్రంలో చేపట్టిన జల సంరక్షణ కార్యక్రమాలు చక్కగా జరుగుతున్నాయి. ఎల్‌నినో కారణంగా తలెత్తిన తీవ్ర వర్షాభావ పరిస్థితులపై రైతులకు, ప్రజలకు అవగాహన కల్పించాలి. ఒక మంచి అధికారి సమస్యలను పరిష్కారిస్తే...అద్భుతంగా పనిచేసే అధికారి అసలు సమస్యలనేవే తలెత్తకుండా చూస్తారనే  కోణంలో అందరూ పనిచేయాలి. ముందుచూపుతో అంతా పనిచేస్తేనే మెరుగైన పాలనను, ఫలితాలను ప్రజలకు అందించగలం. 2027 మార్చి నాటికి పోలవరం ప్రాజెక్టు పూర్తి చేసి జాతికి అంకితం చేస్తాం. ఆగస్టు 14 తేదీన అనకాపల్లికి పోలవరం ఎడమ కాలువ ద్వారా గోదావరి జలాలను విడుదల చేస్తాం. సెప్టెంబరు 1వ తేదీన వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశను కూడా జాతికి అంకితం చేస్తాం. రాష్ట్రంలోని 36 ప్రాజెక్టులను కూడా ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేస్తాం.  ప్రతీ నెలా జరిగే మంత్లీ ఎకనామిక్ రిపోర్టుల ఆధారంగా ఎప్పటికప్పుడు సమీక్షించుకుని ముందుకు వెళ్దాం. రాష్ట్రాభివృద్ధిలో సహకరిస్తున్న అధికారులు, ఉద్యోగులందరికీ అభినందనలు తెలియచేస్తున్నానని ముఖ్యమంత్రి వెల్లడించారు. ఈ సమావేశానికి మంత్రులు, సీఎస్ సాయి ప్రసాద్, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, ఆయా శాఖల కార్యదర్శులు, హెచ్ఓడీలు హాజరయ్యారు.

# కె యు లో 10వ తెలంగాణ ఎన్సీసీ బెటాలియన్ వార్షిక శిక్షణ శిబిరం ప్రారంభం

**550 మంది క్యాడెట్లతో 10 రోజుల శిక్షణ**
**దేశసేవకు సిద్ధం కావాలని కల్నల్ ఎస్.ఎస్. రామదుర్రై పిలుపు**

**కేయూ క్యాంపస్, జూలై 14 (జైభీమ్ న్యూస్):**

కాకతీయ విశ్వవిద్యాలయం ప్రాంగణంలో 10వ తెలంగాణ ఎన్సీసీ బెటాలియన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కంబైన్డ్ అన్యువల్ ట్రైనింగ్ క్యాంప్--×ం (సి ఎ టి సి-×ం) రెండో రోజు కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా క్యాంప్ కమాండెంట్ కల్నల్ ఎస్.ఎస్. రామదుర్రై మాట్లాడుతూ దేశ రక్షణకు యువత ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాలకు చెందిన 550 మంది ఎన్సీసీ క్యాడెట్లు ఈ శిబిరంలో పాల్గొంటున్నారని తెలిపారు. జూలై 13 నుంచి 22 వరకు పదిరోజుల పాటు కొనసాగే ఈ శిక్షణ శిబిరంలో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, సేవాభావం పెంపొందించేలా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. దేశానికి విశ్వాసంతో సేవ చేసే యువతను తీర్చిదిద్దడంలో ఎన్సీసీ కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్న కల్నల్ రామదుర్రై, విద్యార్థులు సానుకూల దృక్పథంతో ముందుకు సాగి భారత సైన్యం, కేంద్ర పారామిలిటరీ బలగాలు, పోలీసు శాఖల్లో ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. దేశ సమైక్యత, జాతీయ సమగ్రత పట్ల అంకితభావం పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ శిబిరంలో ఆయుధాల




వినియోగంపై శిక్షణ, డ్రిల్, వ్యక్తిత్వ వికాసం, పర్సనాలిటీ డెవలప్మెంట్, ఫైర్ ఫైటింగ్, జాతీయ విపత్తు నిర్వహణ, సైబర్ క్రైమ్ అవగాహన, మహిళా సాధికారత, భారత సైన్య చరిత్ర, సైన్యంలో ఉపయోగించే ఆయుధాలపై నిపుణుల ప్రత్యేక తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే 2027 గణతంత్ర దినోత్సవ పరేడ్‌కు వరంగల్ గ్రూప్ తరపున పాల్గొనే క్యాడెట్ల ఎంపిక కూడా ఈ శిబిరంలోనే జరగనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో డిప్యూటీ క్యాంప్ కమాండెంట్ లెఫ్టినెంట్ కల్నల్ రవి సునారి వ్యక్తిత్వ వికాసంపై క్యాడెట్లకు అవగాహన కల్పించారు. జాతీయ విపత్తు నిర్వహణ విభాగం ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కెప్టెన్ డాక్టర్ పి. సతీష్, కెప్టెన్ డాక్టర్ ఎం. సదానందం, జైరామ్ సింగ్, సుబేదార్ మేజర్ సుతారి, రాజేందర్, లెఫ్టినెంట్ గణేష్, లెఫ్టినెంట్ జీవన్, ఫస్ట్ ఆఫీసర్ రవీందర్, భవాని, జేసీఓలు, ఏఎన్ఓలు, పీఐ స్టాఫ్, క్యాంప్ సూపరింటెండెంట్ అరుణ, దత్తు, కుమారస్వామి తదితర అధికారులు పాల్గొన్నారు. మొత్తం 550 మంది ఎన్సీసీ క్యాడెట్లు శిబిరంలో పాల్గొని శిక్షణ పొందుతున్నారు.

# బిజినెస్ రూల్స్‌లో సంస్కరణలు

**క్రౌడ్ సోర్సింగ్ ద్వారా ఫిర్యాదుల సమాచారం**
**ఫైళ్ల క్లియరెన్స్ పేరిట అభివృద్ధి ఆలస్యం కాకూడదు**
**అవకాశాలు అందిపుచ్చుకునేలా నిబంధనల్లో వెసులుబాటు**
**2017తో పోలిస్తే రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో 20 శాతం వృద్ధి  నమోదు**
**ఆర్టీజీఎస్ సమీక్షలో దిశానిర్దేశం చేసిన సీఎం చంద్రబాబు నాయుడు**

**అమరావతి, జూలై 14 (జై భీమ్ న్యూస్) :**

ప్రభుత్వ పాలనలో టెక్నాలజీ అనుసంధానం ద్వారా అవసరం లేని బిజినెస్ రూల్స్‌ను సంస్కరించుకోవాల్సి ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. బిజినెస్ రూల్స్ రీ డ్రాఫ్ట్ చేసేందుకు ఓ కమిటీని ఏర్పాటు చేసి సంస్కరణలు తీసుకురావాలని సీఎం నిర్దేశించారు. సచివాలయంలో రియల్ టైమ్ గవర్నెన్సు కేంద్రంలో వివిధ ప్రభుత్వ శాఖలు అందిస్తున్న పౌరసేవలు, రాష్ట్రంలో యూరియా లభ్యతపై ముఖ్యమంత్రి సమీక్షించారు. దేవాదాయ, రహదారులు భవనాలు, ఏపీఎస్ఆర్టీసీ, రవాణా,అగ్నిమాపక, వ్యవసాయ శాఖలు అందిస్తున్న వివిధ సేవలు, ప్రజల నుంచి వ్యక్తం అవుతున్న సంతృప్త స్థాయిపై సీఎం సూచనలు జారీ చేశారు. ప్రోయాక్టివ్ గవర్నెన్సు అందించేందుకు అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలని సీఎం స్పష్టం చేశారు.  ప్రభుత్వ శాఖల్లో ఉన్నతాధికారులు సరైన నాయకత్వం అందిస్తేనే చిట్టచివరి వ్యక్తి వరకూ పాలనా ఫలితాలు అందుతాయని అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలతో మెరుగైన ఫలితాలు అందేలా నిర్ణయాలు ఉండాలని సీఎం సూచించారు. దేవాదాయశాఖలో ప్రసాదాల నాణ్యతతో పాటు ఆధ్యాత్మికతను మరింత పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలోని 21 ప్రముఖ దేవాలయాల్లో విస్తృతమైన పొటెన్షియల్ ఉందని .. సరైన ప్రణాళిక ద్వారా వీటిని గ్రోత్ సెంటర్లుగా తీర్చిదిద్దాలని సూచనలు ఇచ్చారు. ఈ దేవాలయాలను ఆనుకుని ఆర్థిక కార్యకలాపాలు విస్తృతంగా పెరగాలన్నారు. పర్యాటక కార్యకలాపాలు పెరిగేందుకు కూడా చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో ఇక నుంచి అన్ని ఫిర్యాదులకు సంబంధించి క్రౌడ్ సోర్సింగ్ ద్వారా సమాచారం తీసుకోవాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రతీ అర్జీదారుకూ తగిన సమాధానం కూడా ఇవ్వాలని సీఎం సూచించారు. అగ్నిమాపక శాఖలో సేవల ప్రమాణాల్ని పెంచాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలో యూరియా సరఫరాపై రైతు సంఘాలు, ఆర్ఎస్‌కేల ద్వారా విస్తృత ప్రచారం చేయాలని... యూరియా దుర్వినియోగం కాకుండా చూడాలని సీఎం ఆదేశాలు జారీ చేశారు.

### మానవీయ కోణంలో అర్జీల పరిష్కారం

క్షేత్రస్థాయిలో ఉద్యోగులు, అధికారులు తప్పు చేస్తే ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని.. దీన్ని దృష్టిలో పెట్టుకుని జాగ్రత్తగా వ్యవహరించాలని ముఖ్యమంత్రి సూచించారు. అన్ని బస్టాండ్‌లలోనూ ప్రయాణికులకు సౌకర్యాలు మెరుగుపర్చాలన్నారు. బస్సులు ఖచ్చితమైన సమయానికి వచ్చే అంశంపై దృష్టి పెట్టాలని సూచించారు. రాష్ట్రంలో వివిధ రంగాల్లో అవకాశాలను అందిపుచ్చుకోవాలని సీఎం సూచించారు. గత పాలనలో రాజకీయ కక్షతో కొందరి భూముల్ని 22ఏ కింద పెట్టి వివాదంలోకి నెట్టారన్నారు. ఇప్పటికి 27 లక్షల మందికి పట్టాదారు పాసుపుస్తకాలు అందించామని, ఇంకా 72 లక్షల మందికి జారీ చేయాల్సి ఉందన్నారు. శెట్టిపల్లి భూ వివాదాన్ని పరిష్కరించటం ద్వారా రైతుల సమస్యలు తీరటంతో పాటు 900 కోట్ల విలువైన భూమి ప్రభుత్వానికి వచ్చిందన్నారు. ఇలాంటి అవకాశాలనే అన్ లాక్ చేయాల్సి ఉందని సీఎం అధికారులకు సూచించారు. పీజీఆర్ఎస్‌తో పాటు వివిధ రకాలుగా వచ్చే ప్రతీ అర్జీ, ఫిర్యాదునూ మానవతా కోణంతో పరిష్కరించాలని సీఎం సూచించారు. ఆర్థిక, ఆర్థికేతర అంశాలతో పాటు వ్యక్తిగత, సామాజిక అంశాల్లో వచ్చే ఫిర్యాదులపై తగిన నిర్ణయాలు వేగంగా తీసుకోవాలన్నారు. రొటీన్‌గా ఉండే ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని అప్పుడే ప్రజల్లో సంతృప్తి వ్యక్తం అవుతుందని అన్నారు. గ్రీవెన్స్‌ల పరిష్కారం ఆధారంగా ఫిర్యాదులు తగ్గుతున్నాయా లేక పెరుగుతున్నాయో విశ్లేషించాలన్నారు. సమస్యలు పరిష్కారం అయితే ఫిర్యాదుల సంఖ్య తగ్గుతుందన్నారు. ఆర్టీజీఎస్ రూపొందించిన గవర్నెన్స్ దట్ నెవర్ స్లీప్స్ మాసపత్రికను ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. ఈ సమీక్షకు మంత్రి పార్థసారథి వర్చువల్‌గా, ఆర్టీజీఎస్ నుంచి సీఎస్ సాయి ప్రసాద్, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా వివిధ శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# ముంబయిలో పవన్ కళ్యాణ్‌ను పరామర్శించిన మంత్రి కందుల దుర్గేష్

**పవన్ కళ్యాణ్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న మంత్రి**
**త్వరలోనే సంపూర్ణ ఆరోగ్యంతో ప్రజాక్షేత్రంలోకి వస్తారని ఆకాంక్ష**

అమరావతి, జులై 14 (జై భీమ్ న్యూస్): ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ మంగళవారం ముంబయిలో పరామర్శించారు. ఇటీవల కుడి భుజానికి శస్త్రచికిత్స చేయించుకుని ముంబయిలోని కోకిలాబెన్ ధీరూభాయ్ అంబానీ ఆస్పత్రిలో కోలుకుంటున్న డిప్యూటీ సీఎంను మంత్రి దుర్గేష్ స్వయంగా కలిసి ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కుడి భుజానికి జరిగిన శస్త్రచికిత్స విజయవంతం కావడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చాలా వేగంగా కోలుకుంటున్నారని, ఆయన సంపూర్ణ ఆరోగ్యంతో త్వరలోనే మళ్లీ ప్రజాక్షేత్రంలోకి వస్తారని ఆకాంక్షించారు. వైద్యుల సూచనల మేరకు ఆయనకు ప్రస్తుతం తగిన విశ్రాంతి అవసరమని, ఆరోగ్యం పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరినట్లు మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు.ఆపరేషన్ చేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్న సమయంలోనూ నిరంతరం ప్రజాసేవ గురించే తపించడం డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పట్టుదలకు నిదర్శనమని మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో పార్టీ క్షేత్రస్థాయి బలోపేతానికి, ప్రజల సమస్యల పరిష్కారానికి ఆయన అందించిన దిశానిర్దేశం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, డిప్యూటీ సీఎంకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ క్లిష్ట పరిస్థితుల్లోనూ ఆయన పార్టీ నిర్మాణంపై చూపిస్తున్న అంకితభావాన్ని మంత్రి దుర్గేష్ కొనియాడారు.. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ను కలిసిన వారిలో మంత్రి దుర్గేష్ తో పాటు ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైద్య సేవలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ చైర్మన్ (ఏపీఎంఎస్ఐడీసీ), చిల్లపల్లి శ్రీనివాస్ ఉన్నారు..

# పన్ను తగ్గింపుపై కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞత సభ.

**కూటమి ప్రభుత్వ హయాంలో పన్ను మినహాయింపు పై హర్షం**
**పన్ను మినహాయిపులో మంత్రి రాంప్రసాద్ రెడ్డి  కృషి ఎనలేనిది.**

**విజయవాడ, జులై 14 (జై భీమ్ న్యూస్):**

గత ప్రభుత్వాలు చేయలేని పనిని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సునాయాసంగా చేసి చూపించారు అన్నారు అసోసియేషన్ ప్రతినిధులు. ఈ మినహాయిపులో మంత్రి రాంప్రసాద్ రెడ్డి  కృషి ఎనలేనిదని పేర్కొన్నారు. ఏపీ ప్రైవేట్ బస్సు అసోసియేషన్ నూతన లోగోను ఆవిష్కరించిన మంత్రి. అంతరాష్ట్ర బస్సుల పన్ను 4,000గా ఉన్న పన్నును 2, 500వరకు తగ్గింపుకు రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపిన నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ బస్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయవాడలోని సృజన కళ్యాణ అవెన్యూ లో ఏర్పాటు చేసిన కృతజ్ఞత సభను ఘనంగా నిర్వహించారు.   ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రవాణా రంగ అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం.  ప్రైవేట్ బస్సుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది అని అన్నారు. మంత్రి మాట్లాడుతూ, రవాణా రంగ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రైవేట్ బస్సుల యాజమాన్యాలు ఎదుర్కొంటున్న సమస్యలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించామని తెలిపారు. రవాణా భద్రతపై ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, రవాణా రంగంలో ఉన్న ప్రతి సమస్య పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తుందని, ప్రైవేట్ ఆపరేటర్లకు బివోటి విధానంలో టెర్మినల్ ఏర్పాటు చేస్తామని మంత్రి పేర్కొన్నారు.ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత టూరిస్ట్ బస్సుల పన్ను మినహాయింపు నిర్ణయం తీసుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ నిర్ణయం వెనుక మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి చొరవ, నిరంతర కృషి ఎనలేనిదని కొనియాడారు. గత ప్రభుత్వాలు చేయలేని పనిని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సునాయాసంగా చేసి చూపించారని అభినందించారు. అనంతరం మంత్రి ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ బస్సు అసోసియేషన్ నూతన లోగోను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు గౌతమ్ కిరణ్, ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు

# అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో విమానాశ్రయాల నిర్మాణం

**ఎంఆర్‌వో, ఎయిర్ కార్గో, హ్యాంగర్ వసతులు కల్పించాలి..**
**కాకతీయ సంస్కృతికి అద్దం పట్టేలా వరంగల్ విమానాశ్రయం**
**ఆదిలాబాద్‌కు అవసరమైన భూ సేకరణచేపడతాం**
**కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**

**న్యూఢిల్లీ,జూలై14(జై భీమ్ న్యూస్):**

తెలంగాణ రాష్ట్రంలో నిర్మించనున్నవరంగల్ (మామునూరు), ఆదిలాబాద్ విమానాశ్రయాలను అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతోనిర్మించాలని పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. వ్యూహాత్మకంగా, వాణిజ్య పరంగా వరంగల్, ఆదిలాబాద్ విమానాశ్రయాలకు ఉన్న మెరుగైన పరిస్థితులను సీఎం వివరించారు. కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడుతో ముఖ్యమంత్రి ఢిల్లీలోని పౌరవిమానయాన శాఖ కార్యాలయం లోమంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగావరంగల్ విమానాశ్రయ పనులపై కేంద్ర మంత్రితో సుదీర్ఘంగా చర్చించారు. రైలు, రోడ్డు మార్గాలతో అనుసంధానమైఉండడంతో పాటు కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్, కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, ఇతరపరిశ్రమలతోవరం గల్కిలకనగరంగాఉందని సీఎం తెలిపారు. రానున్న రోజుల్లో పారిశ్రామికంగా మరింతగా వరంగల్‌ను అభివృద్ధి చేస్తామని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుకు సీఎం తెలియజేశారు. ఉత్తరతెలంగాణలోని ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మంలతో పాటు నల్గొండజిల్లాలకు కేంద్రంగా వరంగల్ ఉంటుందని సీఎం తెలిపారు. వరంగల్ విమానాశ్రయంలోఎంఆర్‌వో (మెయింటెనెన్స్, రిపేర్స్, ఓవర్‌హాలింగ్), ఎయిర్‌కార్గో, హ్యాంగర్ వసతులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే భూ సేకరణ పూర్తి చేసినందున టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాలని కోరారు. 2028, జూన్ 2 నాటికి ఎయిర్‌పోర్ట్ పనులు పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగావరంగల్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణాలకు సంబంధించిన డిజైన్లపై కేంద్ర మంత్రి, సీఎం చర్చించారు. వరంగల్‌కు ఘనమైన చరిత్ర ఉన్నందున, కాకతీయ చరిత్ర, సంస్కృతికి అద్ధంపట్టేలా డిజైన్లు ఉండాలనిభావిస్తున్నట్లు సీఎం తెలిపారు. అందుకు కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు సుముఖత వ్యక్తం చేశారు. ఆదిలాబాద్‌లో రక్షణశాఖ ఆధ్వర్యంలో ఎయిర్ పోర్ట్‌తో పాటు పౌర విమానాశ్రయంనిర్మించాలని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుకు సీఎం విజ్ఞప్తి చేశారు. రెండు ఎయిర్‌పోర్ట్‌లకు అవసరమైన భూమిని సేకరించి అందజేస్తామని సీఎం తెలిపారు. వరంగల్ విమానాశ్రయంలో మాదిరే ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ లోనూ ఎంఆర్‌వో, ఎయిర్‌కార్గో, హ్యాంగర్ వసతులు నెలకొల్పాలన్నారు. వరంగల్, ఆదిలాబాద్ రెండు విమానాశ్రయాల్లోనూ విమాన శిక్షణసంస్థలు (ఈ-ుక్ష)నెలకొల్పాలని సీఎం విజ్ఞప్తి చేశారు. హుస్సేన్ సాగర్ నుంచి ప్రకాశం బ్యారేజీకి సీ ప్లేన్‌లు నడిపే అంశాన్ని పరిశీలించాలని రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుకు సూచించారు. అందుకు అవసరమైనప్రతిపాదనలుసమర్పించాలని కేంద్ర మంత్రి సీఎంకు సూచించారు. సమావేశంలోనల్గొండ ఎంపీ రఘువీర్ రెడ్డి, ఆర్ అండ్ బీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్, ప్రభుత్వసలహాదారు, ఎక్స్ అఫీషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీకె.రామకృష్ణారావు, స్పెషల్ సెక్రటరీకోఆర్డినేషన్ అద్వైత్ కుమార్ సింగ్, పౌరవిమానయాన శాఖ సెక్రటరీ మురళీధర్మోహోల్, ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా ఛైర్మన్ విపిన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. అభివృద్ధికి రాజకీయాలతో సంబంధం లేదని, రాజకీయాలుఎన్నికల సమయానికే పరిమితం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడితో సమావేశం అనంతరం సీఎం విలేకరులతో మాట్లాడారు. దేశాల అభివృద్ధిలో విమానాశ్రయాలుకీలక పాత్ర పోషిస్తున్నాయని ఆయన తెలిపారు. తెలంగాణలోనూ విమానాశ్రయాల అభివృద్ధి ద్వారా యువతకు ఉద్యోగాల కల్పన, అభివృద్ధికి తాము పాటుపడుతున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం వివిధ అంశాల్లో తమకుసహకరిస్తుందని, ఎక్కడైనా సమస్యలుంటే కేంద్ర మంత్రులను కలిసి చర్చిస్తున్నామని తెలిపారు. ఏవైనా సమాచార లోపం ఉంటే దానిని పరస్పరం మార్చుకోవడం ద్వారా అధిగమిస్తున్నామని తెలిపారు. అభివృద్ధికి సంబంధించిన అంశాల్లో కేంద్ర మంత్రులనుకలిసేందుకు ఢిల్లీకి వస్తున్నామని, దానిపైనా రాజకీయంగా విమర్శలు చేయడం తగదని సీఎం హితవుపలికారు. విమానాశ్రయాలతోనే అనేక దేశాలు అభివృద్ధి చెందాయని పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. దేశంలో విమానాశ్రయాల ఏర్పాటుకు రాష్ట్రాలు పోటీపడుతున్నాయని తెలిపారు. దేశంలో ఎక్కడాలేనంతత్వరగా తెలంగాణ ప్రభుత్వం విమానశ్రయానికి అవసరమైన భూ సేకరణ చేసి ఇచ్చి చరిత్రసృష్టించిందని ఆయన అభినందించారు. ఇంత త్వరగా స్పందించినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలుపుతున్నట్లు కేంద్ర మంత్రి చెప్పారు. భూ సేకరణ, ఇతర అంశాల్లో దేశంలోని ఇతర రాష్ట్రాలు తెలంగాణ మాదిరేస్పందించాలని కేంద్రం మంత్రి సూచించారు. వరంగల్ సంస్కృతికి అద్దం పట్టేలావిమానాశ్రయ డిజైన్ ఉంటుందని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ఓ ప్రశ్నకుసమాధానమిచ్చారు.



# ఎల్‌నినో పరిస్థితులకనుగుణంగా పంటల ప్రణాళిక

**మెట్ట ప ంటలకు రైతులు ప్రాధాన్యం ఇవ్వాలి**
**వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచన**

**హైదరాబాద్,జూలై14(జై భీమ్ న్యూస్) :**

ఈ రోజు నిర్వహించిన 'రైతు నేస్తం' కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొని ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. రైతులతో నేరుగా మాట్లాడి వాస్తవ పరిస్థితులను ప్రత్యక్షంగా తెలుసు కున్నారు. ఈ ఏడాది తెలంగాణతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో కూడా వర్షపాతం తక్కువగా నమోదవుతోందన్నారు. దీంతో కృష్ణా, గోదావరి ఆయకట్టు ప్రాంతాల్లో నీటి లభ్యత తగ్గే అవకాశం ఉందని, అందుకు అనుగుణంగా రైతులు పంటలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. భూగర్భ జలాల పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలించి రైతులకు సరైన సమాచారం అందించాలని అధికారులను ఆదేశించారు. వ్యవసాయశాఖ, నీటిపారుదల శాఖ, భూగర్భ జలాల శాఖ, భారత వాతావరణ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి రైతులకు ఎప్పటికప్పుడు సూచనలు ఇవ్వాలని చెప్పారు. వర్షపాతం తక్కువగా ఉన్నందున జొన్న, సజ్జ, కొర్ర, పెసర, మినుము, కంది వంటి తక్కువ నీటితో పండే పంటలను సాగు చేయాలని మంత్రి సూచించారు. అలాగే శాస్త్రవేత్తలు సూచించిన విధంగా తక్కువ కాలంలో పండే, తక్కువ నీరు అవసరమయ్యే అధిక దిగుబడి పంట రకాలను ఎంచుకోవాలని రైతులకు సూచించారు. ఈ సందర్భంగా ఐఐఎంఆర్ డైరెక్టర్ మాట్లాడుతూ కొర్ర, సజ్జ, జొన్న వంటి చిరుధాన్యాల సాగును పెంచాలని రైతులకు సూచించారు. భారత వాతావరణ శాఖ, హైదరాబాద్ సంచాలకురాలుస్టెల్లా మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో ఇప్పటివరకు సాధారణం కంటే 30 నుంచి 35 శాతం వరకు తక్కువ వర్షపాతం నమోదైందన్నారు. వచ్చే మూడు నెలల్లో కూడా తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నందున తక్కువ నీరు అవసరమయ్యే పంటలను సాగు చేయాలని రైతులకు సూచించారు. ఇరిగేషన్ శాఖ అధికారులు మాట్లాడుతూ ఎగువ రాష్టాల్లో కూడా వర్షపాతం తక్కువగా ఉండటంతో కృష్ణా, గోదావరి నదుల్లో నీటి లభ్యత తగ్గే అవకాశం ఉందన్నారు. అందువల్ల నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని పంటలు సాగు చేయాలని సూచించారు. భూగర్భ జలాల శాఖ డైరెక్టర్ జిల్లాల వారీగా భూగర్భ జలాల పరిస్థితిని వివరించారు. రాబోయే రోజుల్లో నీటి మట్టం మరింత తగ్గే అవకాశం ఉన్నందున వరి, చెరకు వంటి ఎక్కువ నీరు అవసరమయ్యే పంటలకు బదులుగా ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని రైతులకు సూచించారు. రైతు నేస్తం కార్యక్రమంలో వ్యవసాయ శాఖ కార్యదర్శి . సురేంద్రమోహన్, వ్యవసాయ శాఖ సంచాలకులు బి. గోపి, సహకార శాఖ ప్రత్యేక సంచాలకులు రాహుల్ రాజ్, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఆల్తాస్ జానయ్య, నీటిపారుదల శాఖ ఇంజినీర్-ఇన్-చీఫ్ మధుసూదన్ రావు, భూగర్భ జలాల శాఖ సంచాలకులు లక్ష్మణ్, భారత చిరుధాన్యాల పరిశోధన సంస్థ డైరెక్టర్ డాక్టర్ సత్యవతి, ఐఎండీ శాస్త్రవేత్త డాక్టర్ శ్రావణి, భారత నూనెగింజల పరిశోధన సంస్థ డైరెక్టర్ డాక్టర్ సురేష్, మెట్ట పరిశోధన సంస్థ శాస్త్రవేత్త డాక్టర్ కె.వి. రావు, అలాగే ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్త డాక్టర్ మహాదేవప్ప పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆయా రంగాలకు సంబంధించిన నిపుణులు రైతులకు ఎల్‌నినో పరిస్థితులు, వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనే పంటల నిర్వహణ, నీటి వినియోగం, ప్రత్యామ్నాయ పంటల సాగు, శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులపై పలు సూచనలు చేశారు.

# నగరంలో మరోసారి ఏసీబీ సోదాల కలకలం

**హెచ్‌ఎండీఏ చీఫ్ ఇంజనీర్ బచ్చు రవీందర్ నివాసంలో సోదాలు**
**ఆదాయానికి మించి ఆస్తులు, బంగారం డబ్బు గుర్తింపు**

**హైదరాబాద్,జూలై14(జై భీమ్ న్యూస్):**

హైదరాబాద్ నగరంలో మరోసారి ఏసీబీ సోదాల కలకలం రేగింది. హెచ్‌ఎండీఏ చీఫ్ ఇంజినీర్ బచ్చు రవీందర్ ఇల్లు, కార్యాలయాల్లో ఏసీబీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. మంగళవారం ఉదయం నుంచి సోదాలు కొనసాగాయి. బచ్చు రవీందర్‌పై ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదు అయిన నేపథ్యంలో ఏసీబీ దాడులు నిర్వహిస్తోంది. అక్రమంగా ఆస్తులను కూడబెట్టినట్టు చీఫ్ ఇంజినీర్‌పై ఆరోపణలు ఉన్నాయి. దీంతో ఏకకాలంలో 12 ప్రాంతాల్లో ఏసీబీ అధికారులు సోదాలకు దిగారు. ఏసీబీ డీఎస్పీ మాజిద్ అలీ ఖాన్ ఆధ్వర్యంలో సోదాలు కొనసాగాయి. ఇప్పటికే రవీందర్ నివాసంలో పలు కీలక డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది. ఆస్తుల పత్రాలతోపాటు, వివిధ ప్రాంతాల్లో ఇళ్ల స్థలాలను అధికారులు గుర్తించారు. రవీందర్ నివాసంలో బ్యాంకు లాకర్లను గుర్తించినట్లు సమాచారం. ఈరోజు సాయంత్రం వరకు సోదాలు కొనసాగాయని తెలుస్తోంది.హెచ్‌ఎండీఏ చీఫ్ ఇంజినీర్ బచ్చు రవీందర్ నివాసంలో సోదాలు ముగిశాయని ఏసీబీ డీఎస్పీ మజీద్ అలీఖాన్ వెల్లడించారు. ఈ సోదాల్లో అతని వద్ద ఆదాయానికి మించిన అక్రమ ఆస్తులు భారీగా గుర్తించినట్లు తెలిపారు. సోదాల అనంతరం ఆయన మాట్లాడారు. సుమధుర అక్రోపోలిస్‌లో 3 ప్లాట్, శ్రీవారి మెడోస్‌లో మరో ప్లాట్ ఉన్నట్లు గుర్తించామని అన్నారు. వాసవి అట్లాంటిస్‌లో ఏకంగా మూడు ప్లాట్లు కొనుగోలు చేసినట్లు కనుగొన్నామని చెప్పారు. మసీద్ బండలో నాలుగు అంతస్తుల భారీ భవనం, జడ్చర్లలో 7 ప్లాట్లు, కొండాపూర్‌లో రెండు ప్లాట్లు ఉన్నాయని వివరించారు. శంషాబాద్, షాబాద్ పరిధిలో 4 ఎకరాల వ్యవసాయ భూములు ఉన్నట్లు తమకు ఆధారాలు లభ్యమయ్యాయని పేర్కొన్నారు. సోదాల్లో అర కిలో బంగారం, వెండి వస్తువులతో పాటు రూ.10 లక్షల విలువైన ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్స్ సీజ్ చేశామని అన్నారు. అలాగే బచ్చు రవీందర్ పేరిట ఉన్న 4 బ్యాంక్ లాకర్లను గుర్తించి.. వాటిని ఫ్రీజ్ చేసినట్లు స్పష్టం చేశారు. ఆస్తులతో పాటు ఇంట్లో నిబంధనలకు విరుద్ధంగా దాచి ఉంచిన 18 విదేశీ మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నామని ఏసీబీ డీఎస్పీ మజీద్ అలీఖాన్ వెల్లడించారు.

# ఊరూరా బిఆర్ఎస్ కుట్రలపై ప్రచారం

**కెసిఆర్ హాయంలోనే కూలిన కాళేశ్వరం**
**మీడియాతో మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి**

**హైదరాబాద్,జూలై14(జై భీమ్ న్యూస్):**

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడక ముందే కాళేశ్వరం కుంగిపోయిందని బీఆర్ఎస్‌పై మంత్రి పొన్నం ప్రభాకర్ మరోసారి విరుచుకుపడ్డారు. కాళేశ్వరం కూలడానికి కారణం బీఆర్ఎస్ అని ఆరోపించారు. ఊరూరా తిరిగి బీఆర్ఎస్ చేసిన కుట్రలను ప్రజలకు తెలియజేస్తామన్నారు.మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. రక్తం ప్యాకెట్లతో రాజకీయం చేయాల్సిన అవసరం లేదని బీఆర్ఎస్‌పై మండిపడ్డారు. ఎన్‌డీఎస్‌ఏ తుది నివేదిక ఇచ్చి కాళేశ్వరంలో నీటిని నింపమని చెబితే.. వెంటనే నింపుతామని చెప్పారు. ఇంజినీర్లు ఇచ్చిన సలహాలను పాటిస్తామని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు ఉపయోగంలోకి రావాలంటే ఏం చేయాలో నిపుణులు చెబితే వెంటనే అమలు చేస్తామని మంత్రి వెల్లడించారు.

# సోషల్ మీడియాలో ఇందిరమ్మ ఇండ్ల హవా

**హోం టూర్ వీడియోల హల్ చల్**
**ప్రతి పేదవాడి సొంతింటి కలను సాకారం చేస్తాం-**
**ఎక్స్ వేదికగా మంత్రి పొంగులేటి**

**హైదరాబాద్,జూలై14(జై భీమ్ న్యూస్):**



ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అయిన రోజు నుంచి గృహ ప్రవేశం వరకు తమ ఆనందాన్ని, అనుభవాలను అనేక మంది లబ్దిదారులు యూట్యూబ్ వంటి సోషల్ మీడియా వేదికల ద్వారా పంచుకోవడం ఎంతో సంతోషంగా ఉందని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. తొలిదశలో 4.5 లక్షల ఇందిరమ్మ ఇండ్లు, రెండో దశలో 2.5 లక్షల ఇండ్లు.. మూడో దశ, నాలుగో దశ, ఐదో దశ.. ఇలా ప్రతి పేదవాడి సొంతింటి కలను ఇందిరమ్మ ఇండ్ల రూపంలో సాకారం చేయాలనే లక్ష్యంతో సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. పేదల చిరునవ్వులే మా ప్రభుత్వానికి గొప్ప పురస్కారాలని పేర్కొన్నారు. గతంలో లాగా మభ్య పెట్టే కార్యక్రమంగా కాకుండా పేదలకు ఇళ్లను నిర్మించి ఇస్తున్నామని, అందుకు వీడియోలే సాక్ష్యమనితెలిపారు.

# ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌కు తెలంగాణ ఎంపిక

**కేంద్రమంత్రి మన్సూఖ్ మాండవియాకు మంత్రుల కృతజ్ఞతలు**

**హైదరాబాద్,జూలై14(జై భీమ్ న్యూస్):**

8వ ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌కు తెలంగాణను ఎంపిక చేసినందుకుగాను కేంద్ర యువజన వ్యవహారాలు / క్రీడల శాఖ మంత్రి మన్సుక్ మాండవియాను రాష్ట్ర యువజన సర్వీసులు, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వివేక్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు ఏపీ జితేందర్ రెడ్డి , రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డిలు కలిసి ధన్యవాదములు తెలిపారు. 2026లో నిర్వహించనున్న 8వ ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌కు తెలంగాణను ప్రకటించిన అనంతరం హైదరాబాద్ కు వచ్చిన కేంద్రమంత్రి మన్సుక్ మాండవియను మంత్రి వాకిటి శ్రీహరి కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. కేంద్రం ప్రోత్సాహంతో సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణను క్రీడారంగంలో అగ్రగామిగా నిలుపుతామని మంత్రి వాకిటి శ్రీహరి స్పష్టం చేసారు.

# ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగం పనులు ప్రారంభించాలి..

**ఫ్యూచర్ సిటీ-బందరు పోర్ట్ గ్రీన్‌ఫీల్డ్ రహదారికి అనుమతులు**
**రాజీవ్ రహదారికి ప్రత్యామ్నాయ రహదారి నిర్మించాలి**
**కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి**

**న్యూఢిల్లీ,జూలై14(జై భీమ్ న్యూస్):**

రీజినల్ రింగు రోడ్డు (ఆర్ఆర్ఆర్) ఉత్తర భాగానికి సంబంధించి ఇప్పటికే 95 శాతం భూసేకరణ పూర్తయినందున పనుల ప్రారంభానికి కేంద్ర క్యాబినెట్ అనుమతి ఇప్పించాలని జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. కేంద్ర మంత్రి గడ్కరీతో ఢిల్లీలోని ఆయన నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం భేటీ అయ్యారు. ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగానికి అవసరమైన అనుమతులు మంజూరు చేయాలని కేంద్ర మంత్రిని సీఎం కోరారు. ఆర్ఆర్ఆర్ రెండువైపులా ఏకకాలంలో పనులు ప్రారంభమైతే నిర్మాణం త్వరగా పూర్తవుందుని, నిర్మాణ వ్యయం తగ్గుతుందని సీఎం తెలిపారు. తెలంగాణ రాజధాని హైదరాబాద్ నుంచి ఆంధ్రప్రదేశ్ రాజధానికి గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మిస్తామని ఏపీ పునర్విభజన చట్టంలో పేర్కొన్నందున వెంటనే ఆ రహదారికి అనుమతులు ఇవ్వాలని కేంద్ర మంత్రికి సీఎం విజ్ఞప్తి చేశారు. భారత్ ఫ్యూచర్ సిటీ నుంచి అమరావతి మీదుగా బందరు పోర్ట్‌కు 12 వరుసల రహదారి మంజూరు చేస్తే హైదరాబాద్-విజయవాడల మధ్య 100 కిలోమీటర్ల దూరం తగ్గుతుందని సీఎం తెలిపారు. హైదరాబాద్‌ను బందరు పోర్ట్‌కు సరకు రవాణా వేగవంతమవుతుందని సీఎం వివరించారు. మన్ననూరు-శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్‌కు సంబంధించి అటవీ శాఖ అనుమతులు ఇప్పించేందుకు కృషి చేయాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్ధరీని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. నల్లమల అభయారణ్యం, శ్రీశైలం ఆలయం, శ్రీశైలం జలాశయాలు ఈ కారిడార్ పరిధిలో ఉంటాయని సీఎం తెలిపారు. హైదరాబాద్ నుంచి మంచిర్యాల వరకు ఉన్న రాజీవ్ రహదారికి ప్రత్యామ్నాయంగా మంచిర్యాల నుంచి హైదరాబాద్‌కు ఆరు వరుసల ప్రత్యామ్నాయ రహదారికి అనుమతులు మంజూరు చేయాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి సీఎం విజ్ఞప్తి చేశారు. ఈ ప్రత్యామ్నాయ రహదారికి అవసరమైన భూ సేకరణ తాము చేపడతామని సీఎం తెలిపారు. ఈ ప్రత్యామ్నాయ రహదారి వ్యవసాయ, వ్యాపారపరంగా నూతన అవకాశాలను సృష్టిస్తుందని సీఎం తెలిపారు. సమావేశంలో నల్గొండ ఎంపీ రఘువీర్ రెడ్డి, ఆర్ అండ్ బీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్, ప్రభుత్వ సలహాదారు, ఎక్స్ అఫీషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీ కె.రామకృష్ణారావు, స్పెషల్ సెక్రటరీ కోఆర్డినేషన్ అద్వైత్ కుమార్ సింగ్ దితరులు పాల్గొన్నారు.




జై భీమ్
తెలుగు దినపత్రిక
POWER OF PEOPLE
సమస్యలపై సమరంగా
Jai Bheem TV
STRUGGLE FOR JUSTICE
సామాన్యుడి ఆయుధంగా

## వేంకటేశ్వర స్వామిగా రాజేంద్రప్రసాద్

రాజేంద్రప్రసాద్, శ్రీకాంత్ ప్రధానపాత్రల్లో నటించిన చిత్రం 'మిస్టర్ మిడిల్ క్లాస్' . జి.నాగేశ్వరరావు దర్శకత్వం వహించిన ఈ సినిమా జులై 17న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో తాజాగా దీని ట్రైలర్‌ను విడుదల చేశారు. ఇందులో వేంకటేశ్వర స్వామిగా రాజేంద్రప్రసాద్ నటించగా.. భక్తుడిగా శ్రీకాంత్ కనిపించనున్నారు.

# తదుపరి ప్రాజెక్టులపై నాగచైతన్యం దృష్టి

### సోషల్ మీడియా ప్రచారాలను తిప్పికొట్టిన టీమ్



అక్కినేని నాగచైతన్య తదుపరి ప్రాజెక్టులపై గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో పలు రకాల వార్తలు వైరల్ అవుతున్నాయి. అధికారిక ప్రకటన ఏదీ లేకపోయినా, ఆయన కొత్త సినిమాల లైనప్ గురించి ఎంటర్‌టైన్‌మెంట్ పేజీలు, సినీ వర్గాలకు చెందిన సోషల్ మీడియా ఖాతాల్లో వరుస పోస్టులు దర్శనమివ్వ డంతో అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. ముఖ్యంగా ఇద్దరు కొత్త దర్శకులతో చైతన్య సినిమాలు చేయబోతున్నారనే ప్రచారం హాట్ టాపిక్‌గా మారింది. ప్రస్తుతం 'వృషకర్మ' సినిమా షూటింగ్‌లో బిజీగా ఉన్న నాగచైతన్య, ఆ తర్వాత పూర్తిస్థాయి హారర్ థ్రిల్లర్‌లో నటించనున్నట్లు ప్రచారం జరిగింది. మసూద చిత్రంతో మంచి గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు సాయి కిరణ్ చెప్పిన కథను చైతన్య ఇప్పటికే విన్నారని, ప్రముఖ నిర్మాణ సంస్థ ఏషియన్ బ్యానర్‌పై ఈ సినిమా రూపొందే అవకాశం ఉందని వార్తలు చక్కర్లు కొట్టాయి. కథ నచ్చడంతో కేవలం తుది నిర్ణయం మాత్రమే మిగిలి ఉందని కూడా సోషల్ మీడియాలో ప్రచారం జరిగింది. అంతేకాకుండా బెదురులంక దర్శకుడు క్లాక్స్ దర్శకత్వంలోనూ నాగచైతన్య ఓ కొత్త కాన్సెప్ట్ చిత్రానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారనే వార్తలు కూడా వైరల్ అయ్యాయి. 'వృషకర్మ' షూటింగ్ పూర్తయ్యాక ఈ ఏడాది చివర్లో ఆ సినిమా సెట్స్‌పైకి వెళ్లే అవకాశముందని పలు కథనాలు పేర్కొన్నాయి. వరుసగా ఇద్దరు కొత్త తరహా దర్శకుల పేర్లు వినిపించడంతో అభిమానులు ఈ ప్రాజెక్టులపై ఆసక్తి చూపడం ప్రారంభించారు. అయితే సోషల్ మీడియాలో జరుగుతున్న ఈ ప్రచారానికి నాగచైతన్య టీమ్ స్పష్టత ఇచ్చింది. మసూద దర్శకుడు సాయి కిరణ్‌తో సినిమా ఖరారైందన్న వార్తల్లో ఎలాంటి నిజం లేదని వెల్లడించింది. ఇప్పటివరకు ఇద్దరి మధ్య స్క్రిప్ట్ చర్చలు గానీ, అధికారిక సమావేశాలు గానీ జరగలేదని స్పష్టం చేసినట్లు సమాచారం. అలాగే క్లాక్స్‌తో సినిమా విషయంలో కూడా ఇప్పటివరకు ఎలాంటి అధికారిక నిర్ణయం తీసుకోలేదని తెలుస్తోంది. కొత్త దర్శకుల నుంచి కథలు వింటున్న మాట నిజమే అయినప్పటికీ, ఏ ప్రాజెక్ట్‌కూ ఇంకా తుది ఆమోదం ఇవ్వలేదని సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి.

# తండ్రి విజయ్ కోసం సంజయ్ త్యాగం

### జననాయగన్ కోసం సిగ్మా మూవీ వాయిదా




విజయ్ కుమారుడు జాసన్ సంజయ్ 'సిగ్మా'తో దర్శకుడిగా పరిచయం అవుతున్నాడు. ఈ సినిమాకు సంబంధించిన ఓ వార్త సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. విజయ్ సినిమా కోసం సంజయ్ తన సినిమాను వాయిదా వేసుకున్నట్లు వార్తలు వస్తున్నాయి. 'జన నాయగన్' జులై 24న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఏడు నెలల నిరీక్షణ అనంతరం వస్తోన్న ఈ సినిమా కోసం అభిమానులు ఎదురుచూస్తున్నారు. దీనికి లైన్ క్లియర్ చేయడం కోసం సంజయ్ తన సినిమాను వాయిదా వేసుకుంటున్నారని సమాచారం. సందీప్ కిషన్ కథానాయకుడిగా రూపొందిన 'సిగ్మా' చిత్రాన్ని జులై 31న విడుదల చేయాలని మొదట భావించారు. 'జన నాయగన్' జులై చివరి వారంలో వస్తుండటంతో.. ఈ సినిమా విడుదలను ఆగస్టుకు వాయిదా వేసినట్లు సమాచారం. గతంలో సంజయ్ ఈ చిత్రం గురించి మాట్లాడుతూ.. ఇది తన జీవితంలో ఎంతో ప్రత్యేకమైన సినిమా అని చెప్పారు. ఆగస్టులో పెద్ద సినిమాలేవీ లేకపోవడంతో అప్పుడు రావాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. అయితే దీనిపై అధికారిక అప్‌డేట్ రావాల్సి ఉంది. ఇక విజయ్ కుమారుడు సంజయ్‌కు సంబంధించిన మరో వార్త కూడా సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. కేవలం దర్శకుడిగానే కాకుండా త్వరలోనే నటుడిగా కూడా వెండితెరకు పరిచయం కానున్నట్లు సమాచారం. ప్రముఖ నిర్మాత జీకేఎమ్ తమిళ్ కుమారన్ తన సొంత బ్యానర్‌పై సంజయ్‌ను హీరోగా పరిచయం చేయనున్నట్లు కోలీవుడ్ వర్గాల్లో బలంగా వినిపిస్తోంది. విజయ్ సినిమాల నుంచి వైదొలగిన నేపథ్యంలో ఆయన కుమారుడు వెండితెరకు పరిచయం కానున్నట్లు వార్తలు రావడం ప్రాధాన్యత సంతరించుకుంది.

# తుంబాడ్-2 లో ఆలియా భట్



భారతీయ చలనచిత్ర రంగంలో అద్భుతమైన విజువల్స్, అద్భుతమైన కథాంశంతో కల్ట్ క్లాసిక్‌గా నిలిచిన హారర్ థ్రిల్లర్ చిత్రం 'తుంబాడ్'. ఈ సినిమా సీక్వెల్ 'తుంబాడ్ 2' కోసం ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. కాగా, ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌కు సంబంధించి చిత్ర పరిశ్రమలో ఒక భారీ సంచలన అప్‌డేట్ వెలువడింది. బాలీవుడ్ స్టార్ నటి ఆలియా భట్ అధికారికంగా 'తుంబాడ్ 2' చిత్రబృందంలో చేరింది. ఈ విషయాన్ని సినిమా హీరో మరియు నిర్మాత సోహుమ్ షా సోషల్ మీడియా వేదికగా అధికారికంగా వెల్లడిస్తూ ఆలియాకు ఘన స్వాగతం పలికారు. ఒక సరికొత్త అధ్యాయం మొదలైంది.. 'తుంబాడ్ 2' లోకి స్వాగతం ఆలియా భట్. ప్రళయం రాబోతోంది' అంటూ సోహుమ్ షా తన ఇన్‌స్టాగ్రామ్‌లో ఆలియాతో దిగిన ఫోటోలను పంచుకున్నారు. ఈ సినిమాలో భాగం కావడంపై ఆలియా భట్ సైతం హర్షం వ్యక్తం చేసింది. తాను మొదటిసారి 'తుంబాడ్' చూసినప్పటి నుంచి ఆ చిత్రం తన మనసులోనే ఉండిపోయిందని, ఇంతటి ప్రత్యేకమైన ప్రపంచంలోకి అడుగుపెట్టడం చాలా సంతోషంగా ఉందని ఆమె పేర్కొంది. సోహుమ్ షా, నవాజుద్దీన్ సిద్ధిఖీ వంటి అద్భుతమైన నటులతో కలిసి పనిచేయడానికి తాను ఎంతగానో ఎదురుచూస్తున్నట్లు తెలిపింది. ఇక 'తుంబాడ్ 2' లో ఆలియా భట్ పాత్ర కేవలం అతిథి పాత్రగా కాకుండా కథను మలుపు తిప్పే కీలకమైన రోల్‌గా ఉండబోతోంది. దాదాపు రూ.100 కోట్ల భారీ బడ్జెట్‌తో అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందుతున్న ఈ సీక్వెల్‌కు ఆదేశ్ ప్రసాద్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రం డిసెంబర్ 3, 2027న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.

# జపాన్‌లో తేలిపోయిన దురంధర్




బాలీవుడ్ స్టార్ హీరో రణవీర్ సింగ్ నటించిన యాక్షన్ ఎంటర్‌టైనర్ 'ధురందర్' ప్రపంచవ్యాప్తంగా మంచి విజయాన్ని అందుకున్నప్పటికీ, జపాన్ బాక్సాఫీస్ వద్ద మాత్రం ఆశించిన ఆరంభాన్ని నమోదు చేయలేక పోయింది. ఈ ఫ్రాంచైజీకి ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా భారీ ఆదరణ లభించగా, రెండు భాగాలు కలిపి రూ.3,100 కోట్లకు పైగా గ్రాస్ వసూలు చేసి రికార్డులు సృష్టించాయి. అయితే జపాన్ మార్కెట్‌లో మాత్రం ఈ సినిమా ప్రారంభ కలెక్షన్లు నిరాశ కలిగించాయి. జూలై 10న జపాన్‌లో సుమారు 80 స్క్రీన్‌లలో గ్రాండ్‌గా విడుదలైన 'ధురందర్'కు విడుదలకు ముందు భారీ స్థాయిలో ప్రచారం నిర్వహించారు. రణవీర్ సింగ్ అభిమానులతో పాటు భారతీయ సినీ ప్రేమికులు కూడా ఈ సినిమాపై మంచి అంచనాలు పెట్టుకున్నారు. కానీ ఆ అంచనాలకు తగ్గట్టుగా ప్రేక్షకాదరణ లభించలేదు. ట్రేడ్ వర్గాల సమాచారం ప్రకారం, విడుదలైన తొలి రోజు మధ్యాహ్నం 2 గంటల వరకు 57 థియేటర్లలో ఈ చిత్రాన్ని కేవలం 449 మంది ప్రేక్షకులు మాత్రమే వీక్షించారు. సాయంత్రం, రాత్రి షోలతో కలిపినా పరిస్థితిలో పెద్దగా మార్పు కనిపించలేదు. మొత్తం తొలి రోజు 80 స్క్రీన్‌లలో కేవలం 900 టికెట్లు మాత్రమే అమ్ముడయ్యాయి. ఈ కలెక్షన్లతో వారాంతంలో జపాన్ బాక్సాఫీస్ టాప్-25 చిత్రాల జాబితాలో కూడా 'ధురందర్' స్థానం సంపాదించలేకపోయిందని తెలుస్తోంది. ఆసక్తికర విషయం ఏమిటంటే, ఇటీవల జపాన్‌లో విడుదలైన 'పుష్ప 2' కూడా ఆశించిన స్థాయిలో రాణించలేకపోయింది. ఆ చిత్రం తొలి రోజు 886 టికెట్లు మాత్రమే విక్రయించగా, 'ధురందర్' 900 టికెట్లతో స్వల్పంగా మెరుగైన ఆరంభాన్ని నమోదు చేసింది. అయితే ఈ రెండు చిత్రాలు కూడా అక్కడ భారీ ఓపెనింగ్ సాధించలేకపోవడం విశేషం.